తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
శుక్రవారం
పేజీలు - 12



## రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు నిలిపివేయాలి

- నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లుల బంద్
- జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్రావు

**నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు, తనిఖీల పేరుతో మిల్లర్లను ఇబ్బందులకు గురిచేయడం నిలిపివేయాలని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లులు బంద్ పాటిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లాలోని రైస్ మిల్లులు కూడా బంద్ పాటిస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మారుతి ఇన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైస్ మిల్లర్లకు నాణ్యతలో లోపాలున్న, రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని సరఫరా చేస్తూ, అదే ధాన్యంతో నాణ్యమైన బియ్యం తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. ధాన్యం నాణ్యతకు సంబంధించిన సమస్యలను మిల్లర్లపై మోపడం వల్ల వారు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోనె సంచుల విషయంలోనూ మిల్లర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం లెక్కించి ఇచ్చిన గోనె సంచులను మిల్లర్లు తిరిగి లెక్కించి అప్పగించాల్సి వస్తోందన్నారు. పలుమార్లు వినియోగించడం వల్ల కొన్ని గోనె సంచులు దెబ్బతిన్నా, వాటి విషయంలో కూడా మిల్లర్లపైనే బాధ్యత మోపడం సమంజసం కాదన్నారు. ధాన్యం సేకరణ, రవాణా, నిల్వ, బియ్యం మిగతా 20లో..




## ప్రభుత్వ నిబంధనల భారాన్ని మిల్లర్లపై మోపి..
## రైతును నష్టపరిచే పరిస్థితి తీసుకురావద్దు

- ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్

**ములుగు జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్10 (జనం సాక్షి):** ప్రభుత్వ నిబంధనల భారాన్ని మిల్లర్లపై మోపి రైతును నష్టపరిచే పరిస్థితి తీసుకురావద్దని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ విమర్శించారు. ములుగు జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ "రైతు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.ఆ ధాన్యం మిల్లుకు వస్తుంది. మిల్లర్ మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి సిఎంఆర్ అందిస్తాడు.కానీ ఈ మొత్తం ప్రక్రియలో ప్రభుత్వం విధించిన నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలు, సిఎంఆర్ స్వీకరణలో జాప్యం, తరుగుదల విషయంలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరిస్తే... చివరకు నష్టపోయేది మిల్లర్ మాత్రమే కాదు, రైతు కూడా' అని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కుమార్ అన్నారు.

వార్త మెయిన్ 7లో



## కమర్షియల్ షట్టర్ల అమ్మకం పేరుతో మోసం..!

- వరంగల్ స్టేషన్ రోడ్ లో బాధితుల ఆందోళన

**వరంగల్ ఈస్ట్ ,సెప్టెంబర్ 10(జనం సాక్షి) :** వరంగల్ చౌరస్తా లో ఓ వ్యక్తి కమర్షియల్ షట్టర్ అమ్మకానికి పెట్టి అందినకాడికి లక్షల్లో వసూలు చేస్తూ మోసం చేస్తున్నాడని పలువురు బాధితులు వెల్లడించారు. బుధవారం బాధితుడు వరంగల్ నగరానికి చెందిన దుబాసి అశోక్ తెలిపిన వివరాల ప్రకారం. 2009 లో ఆకారపు వారి దేవాలయం ఎదురుగా అదే వరంగల్ నగరానికి చెందిన అనంతుల చంద్రకళ భర్త కైలాసం కు చెందిన రెండు కమర్షియల్ షట్టర్ లను అమ్మకం పెట్టడంతో 34 లక్షలు పెట్టి కొనుగోలు చేశానని ఆరోపించారు.దానికి సంబంధించిన పలు డాక్యుమెంట్లు ఉన్నాయని తెలిపారు. కానీ ఆ షట్టర్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో కోర్టు మెట్లు ఎక్కడం కూడా జరిగిందని వివరించారు.కాగా చంద్రకళ భర్త కైలాసం యొక్క ఇద్దరు కూతుర్ల పేరు మీద సదర్ కమర్షియల్ షెటర్లను రిజిస్ట్రేషన్ చేసినట్టు తెలిపారు.దానిలో భాగంగా గురువారం అశోక్ కుటుంబానికి చెందిన పలువురు ఆ షట్టర్ల ను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేయగా పోలీసులు వచ్చి స్థానిక ఇంతేజర్గంజ్ పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా అక్కడ ఉన్నటువంటి మరికొంతమంది రెండు షట్టర్ల పేరు చెప్పి తమ వద్ద కూడా షట్టర్ల ఓనర్ లక్షలు వసూలు చేసినట్టు పేర్కొన్నారు.

## ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో అర్హులైన వారి వివరాలు నమోదు చేయాలి



- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..

**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 10(జనంసాక్షి):** వరంగల్ నగరంలోని ఎనుమాముల పరిధిలోని బాలాజీ నగరలో నిర్వహిస్తున్న సర్ హియరింగ్ కార్యక్రమంలో పరువు లేని వారి వివరాలు నమోదు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద దేవి పరిశీలించారు.

గురువారం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా వచ్చిన అభ్యంతరాలు, దావాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన వారి వివరాలను సక్రమంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. హియరింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సమాచారం, సహాయాన్ని అందించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు.ఈ పర్యవేక్షణ లోవరంగల్ ఆర్డీవో ఇ ఆర్వో ఓ వర్ధన్నపేట ఆర్డీవో సుమ ఆర్డీవో డి ఏ ఓ మరియు ఏ. ఇ.ఆర్.ఓ ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల సందర్భంగా సమన్వయ సమావేశం



### స్టేషన్ హౌస్ ఆఫీసర్: కె.రాజు

**కెరమెరి, సెప్టెంబర్ 10(జనంసాక్షి)** గణేష్ ఉత్సవాలు–2026ను ప్రశాంతంగా, సురక్షితంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు కెరమెరి పోలీస్ స్టేషన్‌లో అధికారులు మరియు గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, ఎంఆర్ఓ, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, విద్యుత్ శాఖ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖల అధికారులు, పోలీస్ అధికారులు మరియు గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు. సమావేశంలో గణేష్ పోర్టల్–2026లో ప్రతి విగ్రహం/మండపం వివరాల నమోదు, విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం, విగ్రహం ఎత్తు, సీసీటీవీ ఏర్పాటు, మండపాల భద్రత, విద్యుత్ మరియు ఫైర్ సేఫ్టీ, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన రూట్, ఇమర్జన్ పాయింట్లు, వాహనాలు, డ్రైవర్ల వివరాలు, జియో ట్యాగింగ్ తదితర అంశాలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ప్రతి మండపం వద్ద కనీసం ముగ్గురు వ్యక్తులతో రాత్రి భద్రత ఏర్పాటు చేయాలని, పెద్ద మండపాల వద్ద అవసరాన్ని బట్టి 5 నుండి 10 మంది వరకు వాలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే సీసీటీవీ కెమెరాలు, పండల్ రిజిస్టర్ / పాయింట్ బుక్ తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. డీజేలకు అనుమతి లేదని, బాణసంచా వినియోగించరాదని, అనుమతించిన శబ్ద పరిమితులను పాటిస్తూ రాత్రి 10 గంటలలోపు సౌండ్ సిస్టమ్ నిలిపివేయాలని నిర్వాహకులకు సూచించారు. ఏదైనా సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించాలంటే ముందుగానే పోలీసులకు సమాచారం ఇచ్చి అవసరమైన అనుమతులు పొందాలని తెలిపారు.. నిమజ్జనానికి పోలీస్ శాఖ నిర్ణయించిన రూట్‌ను మాత్రమే ఉపయోగించాలని, ట్రాఫిక్ నిబంధనలు మరియు వన్ వే విధానాన్ని పాటించాలని సూచించారు. నిమజ్జన రూట్‌లో రోడ్డు గుంతలు, చెట్ల కొమ్మలు, విద్యుత్ వైర్లు తదితర సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో ముందుగానే పరిష్కరించనున్నట్లు తెలిపారు. బ్లూ కోల్ట్స్ బృందాలు మరియు పోలీస్ అధికారులు మండపాలను నిరంతరం తనిఖీ చేస్తారని, అవసరమైన చోట చెక్ పోస్టులు, పికెట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సోషల్ మీడియా కార్యకలాపాలపై కూడా పోలీస్ శాఖ నిఘా ఉంటుందని, ఏదైనా గొడవ లేదా సమస్య తలెత్తే అవకాశం ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం గణేష్ ఉత్సవాలను మరింత ప్రశాంతంగా, క్రమబద్ధంగా మరియు సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు నిర్వాహకులు మరియు అన్ని సంబంధిత శాఖలు పూర్తి సహకారం అందించాలని అధికారులు కోరారు.

# ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా తిరుపతి



**నెన్నెల, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఏఐకేఎంఎస్ 9వ రాష్ట్ర మహాసభల్లో కామ్రేడ్ రత్నం తిరుపతి రెండోసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని జిల్లా ఏఐకేఎంఎస్ ఉపాధ్యక్షుడు దొండ ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా రత్నం తిరుపతి మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలను ఏకం చేసి వారి సమస్యలపై దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. రైతులు, కూలీల హక్కుల సాధన కోసం నిరంతరం ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రెండోసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్న నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# పార్టీలకతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

### 16 చింతల తండా గ్రామ సర్పంచ్ బానోతు విక్రమ్



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 10 ( జనం సాక్షి):** పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని సర్పంచ్ బానోతు విక్రమ్ అన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు బానోతు సుగుణ దేష్యకు రూ. 16 వేలు, బానోతు కిషన్ కు రూ. 22 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరయ్యాయి. గురువారం బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఏ పార్టీకి చెందినవారన్నది కాంగ్రెస్ పార్టీ చూడదని ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు కేశ్య, రాంజీ, గ్రామస్థులు శంకర్, ఈర్య, శ్రీను, బిచ్చు, రాజు, బద్రు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు తప్పనిసరిగా పంట వివరాలు నమోదు చేసుకోవాలి



### వ్యవసాయాధికారి వినోద

**జైనూర్, సెప్టెంబర్10,(జనం సాక్షి)** తాము సాగు చేసిన ప్రతి పంట వివరాలను విధిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఏఈవో) వినోద సూచించారు. గురువారం రోజున మండల పరిధిలోని మల్లవాయి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ పంట నమోదు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ఏఈ ఓ రైతులతో కలిసి పొలాల్లో పర్యటించి, సాగు చేసిన పంటలను పరిశీలించి మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేసే రైతు సంక్షేమ పథకాలు, పంటల బీమా, సున్నా వడ్డీ రుణాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపరిహారం, మరియు ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు ధాన్యం/పంట విక్రయించాలంటే పంట నమోదు తప్పనిసరి అని స్పష్టం చేశారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు మరియు ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నంబర్‌ను అధికారులకు అందించి వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు. కౌలు రైతులు కూడా సాగు వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఏఈ ఓ వినోద, గ్రామ సర్పంచ్ ప్రతిభ,గ్రామ పటేల్ మాణిక్, గేడం గణపత్, సోయం రాజు, చిత్రు లింబరావు వ్యవసాయ శాఖ సిబ్బంది, హెల్ప్‌డెస్క్ బాధ్యులు కొడప ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ పట్టా అందుకున్న తాళ్ళ అజయ్




**చెన్నారావుపేట, సెప్టెంబర్ 10 ( జనం సాక్షి ):** చెన్నారావుపేట గ్రామంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన తాళ్ళ యాకయ్య, కరుణశ్రీ దంపతుల కుమారుడు తాళ్ళ అజయ్ ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 85 వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ వర్సిటీ ఛాన్సలర్ శ్రీశివ ప్రతాప్ శుక్లా అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా భారత్ బయోటెక్ వ్యవస్థాపకులు, చైర్మన్ డా. కృష్ణ ఎల్లా హాజరయ్యారు. ఓయూ వైస్ చాన్సలర్ ప్రో.కుమార్ మొలుగరం సమక్షంలో వారి చేతుల మీదుగా రోల్ ఆఫ్ స్టూడెంట్స్ ఇన్ తెలంగాణ మూమెంట్(1956–2014) అనే అంశం మీద పరిశోధనకు గాను ఈ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రయాణంలో సహకరించిన గురువులకు,బందు మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.డాక్టరేట్ సాధించడం ద్వారా సామాజిక సేవ బాధ్యత మరింత పెరిగిందని ఈ డాక్టరేట్ ని తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన విద్యార్థి, ఉద్యమకారులకు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 10( జనం సాక్షి):** వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను చెన్నారావుపేట మండలం కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వీరనారి చాకలి ఐలమ్మ త్యాగాలను భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నాటి దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలిచిన ధైర్య శీలి, చాకలి ఐలమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో రజక కుల పెద్ద చాపర్తి రాజు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కంది కృష్ణ చైతన్య రెడ్డి, ఉపసర్పంచ్ దొంతి శ్రీనివాస్, రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు సంగెం రమేష్, మండల రజక సంఘం అధ్యక్షులు ఉప్పుల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి బర్ల యాకయ్య, మర్రి రమేష్, గట్ల కృష్ణయ్య, పొదిల ఆగయ్య, ఉప్పుల వీరస్వామి, ఉప్పుల రాజకుమార్, మర్రి మధుకర్, రాయరాకుల శ్రీకాంత్, గోపు శ్రీనివాసరెడ్డి, చాగంటి రాజు, ఓరుగంటి రాజు, వైనాల స్వామి చరణ్, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలు ఎరువులు రైతులకు సరళమైన ధరకు అందించాలి

- రైతులకు పంపిణీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలి
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**మహా ముత్తారం సెప్టెంబర్ 10 (జనం సాక్షి)**రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరసమైన ధరలకు అందించడంతో పాటు పంపిణీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.గురువారంమహాముత్తారం మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయ కేంద్రాన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రారంభించారు.అనంతరం విక్రయ కేంద్రంలోని ఆన్‌లైన్ బిల్లింగ్ సాఫ్ట్‌వేర్, స్టాక్ రిజిస్టర్లు, డిజిటల్ సేవల నిర్వహణను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటి సారిగా ప్రాథమిక సహకార సంఘం ద్వారా పురుగు మందులు, విత్తనాలు విక్రయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులను యాప్ ద్వారా నమోదు చేసి పురుగు మందులు, విత్తనాలు విక్రయాలు నిర్వహిస్తారని,కొనుగోలు చేసిన తదుపరి రైతు మొబైల్ నంబర్ కు మెసేజి వస్తుందని తెలిపారు. దీని ద్వారా పారదర్శకత ఉంటుందని తెలిపారు. రైతులకు జారీ చేసే బిల్లులు, రసీదులను నేరుగా వారి వాట్సాప్ నంబర్లకు పంపించే ఆన్‌లైన్ బిల్లింగ్ విధానం వల్ల పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని తెలిపారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు పక్కాగా నమోదు చేస్తూ, రైతులకు అవసరమైన సమయంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.మహాముత్తారం, పలిమెల మండలాల రైతులకు ఇబ్బందులు లేకుండా కాటారం నుంచి విత్తనాలు, ఎరువుల సరఫరా అందుబాటులో ఉండేలా మ్యాపింగ్, సరఫరా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ౖతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా పీఏసీఎస్ కేంద్రాల ద్వారా ప్రభుత్వ గుర్తింపు పొందిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను సరసమైన ధరలకు అందించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు సకాలంలో అవసరమైన సేవలు అందిస్తూ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సహకార అధికారి వాలియా నాయక్, మహాదేవపూర్ వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీపాల్, మండల వ్యవసాయ అధికారి అనూష, మండల అభివృద్ధి అధికారి నిశాంత్, వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ సోమశాంతకుమార్,పీఏసీఎస్ సీఈఓ, మార్క శ్రీధర్,డైరెక్టర్లు సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత ద్రోహి మాజీ సీఎం కేసీఆర్

### కాంగ్రెస్ ఎస్సి సెల్ మండల అధ్యక్షులు కన్నం సందీప్



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 10 ( జనం సాక్షి ):** మాజీ సీఎం కేసీఆర్ దళిత ద్రోహి అని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కన్నం సందీప్ అన్నారు. గురువారం చెన్నారావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు రూపిక శ్రావణ్ కుమార్, ఎస్సి సెల్ జిల్లా వైస్ చైర్మన్ మాదారపు చరణ్ లతో కలిసి నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.ఈ తెలంగాణ ఉద్యమంలో మాల మాదిగ సమాజం పార్టీలకు అతీతంగా కాళ్లకు గజ్జ కట్టి డప్పు చేతబట్టి ప్రజలను చైతన్యం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేసిన దళితుల పట్ల వివక్ష చూపుతున్న బిఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.తెలంగాణ రాష్ట్రం దళిత అమరుల త్యాగాల మీద తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఉద్యమ సమయంలో దళిత ద్రోహి కేసీఆర్ ఈ రాష్ట్రం దళితులతోనే సాధ్యమైతదని దళితులను రెచ్చగొట్టి మమ్మల్ని వాడుకొని ఆనాడు సీఎంగా కెసిఆర్ పదేళ్లు కుర్చీలో కూర్చొని తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే దళితుడినే ముఖ్య మంత్రిని చేస్తానని ప్రకటించి మాట తప్పాడన్నారు. ముఖ్య మంత్రి పీఠాన్ని అధిరోహించిన ద్రోహి కెసిఆర్ అని కెసిఆర్ ప్రోత్బలంతో దళితుల మీద దాడి చేయడం ఎర్రబెల్లి ఫామ్ హౌస్ దగ్గర బిఆర్ఎస్ నాయకులు దళితులు నడిచిన స్థలాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం సిగ్గు చేటని విమర్శించారు. దళితులంటే బిఆర్ఎస్ పార్టీకి ఎంత చులకనో ఉందో దళిత సమాజం ఒక్కసారి ఆలోచన చేయాలని బిఆర్ఎస్ పార్టీ దళితుల పట్ల వివక్ష చూపుతుందని ఒక దళిత బిడ్డ ఉప ముఖ్య మంత్రిగా ఉంటే సహించలేదని ఎప్పటికైనా బిఆర్ఎస్ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ అని దళిత సోదరులారా ఆత్మ పరిశీలన చేసుకోవాలని కోరారు.రాబోయే రోజులలో రాష్ట్రంలో బిఆర్ఎస్ మనుగడ లేకుండా చేయాలని దళిత సమాజం ఏకం కావాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో విజయ్, రామ్మోహన్, స్వామి, అశోక్, దిలీప్, ప్రభాస్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

# సీఐఎస్‌సీఈ జాతీయ క్రికెట్ ఛాంపియన్‌షిప్‌కు తెలుగు రాష్ట్రాల జట్టు కెప్టెన్‌గా శ్లోక ఫాల్గుణ రెడ్డి

### ఉత్తర తెలంగాణకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తున్న గంగారం యువ క్రికెట్ ప్రతిభ





**గంగారం: సెప్టెంబర్ 10 ( జనం సాక్షి ):**సీఐఎస్‌సీఈ జాతీయ అండర్-19 మహిళల క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న ఆంధ్రప్రదేశ్--తెలంగాణ సంయుక్త అండర్-19 మహిళల క్రికెట్ జట్టుకు గంగారం వాసి, హైదరాబాద్‌కు చెందిన ఫాల్గుణ రెడ్డి కెప్టెన్‌గా ఎంపికైంది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో సెప్టెంబర్ 10 నుంచి జరుగుతున్న సీఐఎస్‌సీఈ జాతీయ ఛాంపియన్‌షిప్‌లో ఫాల్గుణ తెలుగు రాష్ట్రాల సంయుక్త జట్టుకు సారథ్యం వహిస్తోంది.ఫాల్గుణ హైదరాబాద్‌లోని మల్లాపూర్ జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో 12వ తరగతి చదువుతోంది. చదువుతో పాటు క్రికెట్‌లోనూ విశేష ప్రతిభ కనబరుస్తున్న ఆమె గతంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (ఎజూా) అండర్-19 మహిళల జట్టుకు ఎంపికైంది. అనంతరం బీసీసీఐ దేశవాళీ అండర్-19 మహిళల క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికైన తెలంగాణ జట్టులోనూ స్థానం సంపాదించింది. కుడిచేతి మీడియం పేస్ బౌలర్‌గా రాణిస్తున్న ఫాల్గుణకు సీఐఎస్‌సీఈ జాతీయ ఛాంపియన్‌షిప్‌లో తెలుగు రాష్ట్రాల సంయుక్త జట్టుకు కెప్టెన్‌గా అవకాశం లభించడం ఆమె క్రికెట్ ప్రయాణంలో మరో కీలక మైలురాయిగా నిలిచింది.అండర్-14లోనూ సత్తా గతంలో జాతీయ స్థాయి అండర్-14 మహిళల క్రికెట్‌లోనూ ఫాల్గుణ అద్భుత ప్రతిభ కనబరిచింది. అలాగే హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగిన క్రికెట్ పోటీల్లో అప్పటి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డా. తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా ఛాంపియన్‌షిప్ అవార్డును కూడా అందుకుంది.క్రీడలతో పాటు కళారంగంలోనూ ప్రతిభ క్రికెట్‌తో పాటు కూచిపూడి, త్రోబాల్, అబాకస్ తదితర రంగాల్లోనూ ఫాల్గుణ తన బహుముఖ ప్రతిభను చాటుతోంది. అబాకస్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి గణన సామర్థ్యాన్ని ప్రదర్శించిన ఆమె కళారంగంలోనూ ప్రత్యేక గుర్తింపు పొందింది.అండర్-14లోనూ సత్తా గతంలో జాతీయ స్థాయి అండర్-14 మహిళల క్రికెట్‌లోనూ ఫాల్గుణ అద్భుత ప్రతిభ కనబరిచింది. గంగారం నుంచి జాతీయ స్థాయికి శ్రీ రాజలింగారెడ్డి--బుచ్చక్క దంపతుల మనవరాలు, శ్రీ జైపాల్ రెడ్డి--కావ్య రాజేశ్వరి దంపతుల కుమార్తె అయిన ఫాల్గుణ రెడ్డి జాతీయ స్థాయిలో తెలుగు రాష్ట్రాల సంయుక్త అండర్-19 మహిళల క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక కావడం పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.గంగారం నుంచి ఎదిగి జాతీయ స్థాయి క్రికెట్‌లో తన ప్రతిభను చాటుతున్న ఫాల్గుణ రాబోయే రోజుల్లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు. ఆమె సారథ్యంలో తెలుగు రాష్ట్రాల సంయుక్త జట్టు జాతీయ ఛాంపియన్‌షిప్‌లో విజయాలు సాధించాలని వారు కోరుకుంటున్నారు.

# మట్టి వినాయకులనే ప్రతిష్టించి పూజించాలి



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 10 ( జనం సాక్షి ):** మట్టి వినాయకులనే ప్రతిష్టించి పూజించాలని చెన్నారావుపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈదునూరి రవీందర్ రెడ్డి అన్నారు.ప్రాథమిక పాఠశాలలో ని విద్యార్థులు మట్టి వినాయకులను తయారు చేశారు. రంగురంగుల వినాయకుల వల్ల పర్యావరణం కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే ప్రతిష్టించి నవరాత్రుల పూజలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఇల్ల సూరయ్య, పూదోట అనిల్ కుమార్, మర్రి రాజు, కన్యధార అనిల్ కుమార్, ఆఫీస్ సబార్డినేట్ భూక్య క్రాంతి కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళల ధైర్యసాహసాలకు ప్రతీక చాకలి ఐలమ్మ వీరత్వం

### అదనపు కలెక్టర్ విజయ లక్ష్మీ



**రేగొండ,సెప్టెంబర్10( జనం సాక్షి):**తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళల ధైర్యసాహసాలకు ప్రతీకగా చాకలి ఐలమ్మ వీరత్వం నిలిచిందని జిల్లా అదనపు కలెక్టర్ విజయ లక్ష్మీ అన్నారు.గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.సమాజంలో మహిళల ధైర్యసాహసాలకు, హక్కుల కోసం పోరాడిన స్ఫూర్తిదాయక వ్యక్తిగా ఐలమ్మను కొనియాడారు.ఈ కార్యక్రమంలో రేగొండ మండల ఎంపీడీవో ఎం. వెంకటేశ్వర్ రావుతో పాటు కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పలిమెలలో పైప్‌లైన్ పనులను ప్రారంభించిన సర్పంచ్ పుష్పలత



**పలిమెల సెప్టెంబర్ 10 (జనం సాక్షి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా,పలిమెల గ్రామపంచాయతీ పరిధిలోని పలిమెల, బోడాయిగూడెం, కామన్ పల్లి గ్రామాల్లో కొత్తగా మంజూరైన మంచినీటి పైప్‌లైన్ అదేవిదంగా నల్లాల కలెక్షన్ పనులను సర్పంచ్ జవ్వాజి పుష్పలత తిరుపతి శుక్రవారం కొబ్బరికాయ కొట్టి అట్టహాసంగా ప్రారంభించారు.కొత్తగా వెలిసిన కాలనీల్లో పైప్‌లైన్ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, ఈ పనుల పునరుద్ధరణకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారు. మంత్రి చొరవతోనే ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించే కార్యక్రమం సాకారమైందని సర్పంచ్ తెలిపారు.గ్రామ ప్రజలకు నాణ్యమైన మంచినీరు అందించడమే లక్ష్యంగా గ్రామపంచాయతీ పాలకవర్గం ఎల్లవేళలా కృషి చేస్తుందని ఈ సందర్భంగా పుష్పలత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, స్థానిక ప్రజలు విశేషంగా పాల్గొన్నారు.

# భావితరాలకు స్ఫూర్తి దాయకం వీరనారి చాకలి ఐలమ్మ

- మహిళా సాధికారత, సామాజిక న్యాయం దిశగా ప్రభుత్వం కృషి
- కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 10 (జనం సాక్షి)** వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి అన్నారు. వీరనారి చాకలి (చిట్యాల) ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం న్యూ శాయంపేట జంక్షన్‌లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అధికారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ కేవలం ఒక వర్గం కోసం మాత్రమే పోరాడిన మహిళ కాదని, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరవనితగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయకుండా అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ పోరాటం మహిళా సాధికారత, ఆత్మగౌరవం, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఆమె చూపిన ధైర్యం, తెగువ, ఆత్మవిశ్వాసాన్ని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాల ద్వారా చేయూతనందిస్తోందని తెలిపారు. పోరాట యోధుల త్యాగాలు, వారి పోరాట చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చాకలి ఐలమ్మ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని, ఆమె స్ఫూర్తిని నేటి తరానికి అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ హనుమకొండ, జిల్లాల అదనపు కలెక్టర్లు వై.వి. గణేష్, ఎల్. కిషోర్ కుమార్,ఎన్. రవి, వరంగల్ ఆర్డీవో సుమ, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పుష్పలత, లక్ష్మణ్, మత్స్య శాఖ అధికారి శ్రీపతి, డాక్టర్ మధుచందర్, మాజీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, మాజీ కార్పొరేటర్ చీకటి ఆనంద్, మున్సిపల్, కుడా, ఇతర శాఖల అధికారులు, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## డిఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్



**రేగొండ,సెప్టెంబర్ 10( జనం సాక్షి):** సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్ అన్నారు.మండలంలోని చిన్నకోడెపాక పరిధిలోని రాజక్కపల్లి వైద్య శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితులు,సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కాలానుగుణంగా వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రమైన తాగునీటిని వినియోగించాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి తగిన వైద్య సేవలు పొందాలని తెలిపారు. అనంతరం వైద్య శిబిరంలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.కార్యక్రమంలో డా. హిమబిందు,సిహెచ్ఓ కె. వెంకటేశ్వర్లు, ఎంఎల్ హెచ్ పి డా. మధుకర్, ఏ ఎన్ ఎం లు బి. సుగుణ, మంజుల, ఆశా కార్యకర్తలు ఎ. తిరుమల, ఎం. తిరుమల, సుమలత పాల్గొన్నారు.

# 13న సిద్దార్థలో ఉచిత కంటి వైద్య శిబిరం

## జనతా ట్రస్ట్ చైర్మన్, బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా గోగుల రాణాప్రతాప్ రెడ్డి



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 10 ( జనం సాక్షి ):** ఈనెల 13న ఆదివారం మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల హైస్కూల్ లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జనతా ట్రస్ట్ చైర్మన్, బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా గోగుల రాణాప్రతాప్ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల హై స్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం పట్ల జనతా ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. అలాగే పేదల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అందులో భాగంగా జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో తన విద్యాసంస్థల చైర్మన్ కందిగోపాల్ రెడ్డి శంకర ఐ హాస్పిటల్ వారి సహకారంతో ఈ నెల 13వ తేదీన మండల ప్రజల కోసం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి నిపుణులైన వైద్యులచే తగిన చికిత్స , సలహాలు, సూచనలు అందించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా వృద్ధులు, కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారు, పేద, మధ్యతరగతి కుటుంబాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.చెన్నారావుపేట మండలంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దార్థ గురుకుల హైస్కూల్ ప్రిన్సిపాల్ అండెం కరుణాకర్ రెడ్డి, బిజెపి జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఉప్పరపల్లి విద్యార్థులు ఎంపిక

## అభినందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయ




**చెన్నారావుపేట, సెప్టెంబర్ 10 ( జనం సాక్షి):** సాఫ్ట్ బాల్ పోటీలకు ఉప్పరపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 3 తేదీన వరంగల్ ఓ సిటీ క్రీడా మైదానంలో జరిగిన వరంగల్ జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్ (14 సంవత్సరాల విభాగం) ఎంపిక పోటీలలో చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బి. నిఖిల్, ఆర్. కిషోర్ అనే విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల11,12, 13 వ తేదీలలో బెల్లంపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తేజావత్ జయ,వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్నలు తెలిపారు. రాష్ట్రస్థాయి దపోటీలకు ఎంపికైన నిఖిల్ ,కిషోర్ లను వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్నను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయతో పాటు ప్రధానోపాధ్యాయురాలు జయతో పాటు ఉపాధ్యాయులు సునీత, రాగి శశిధర్, కె. సంతోష్ కుమార్, పిన్నింటి బాలాజీ రావు, ఏ ఉదయ్ కుమార్, ఎల్ మొగిలి, జి.సుందర్, కె. మాధవి వి. సతీష్ కుమార్, బి రమాదేవి, హంస రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ జాహేద్, క్రాఫ్ట్ టీచర్ చింతకింది ఇందిర, గ్రామస్తులు అభినందించారు.

# సంప్రదాయ పంటలు ఆధునిక విధానాలను అవలంబించాలి

- రేగొండ మండలంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి పర్యటన
- రైతులకు సమీకృత ఫామ్ ఫండ్ ప్రయోజనాలపై అవగాహన



**రేగొండ,సెప్టెంబర్ 10( జనం సాక్షి):** మండలంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి గురువారం పర్యటించారు.మండలంలోని కొడవటంచ గ్రామంలో రైతులతో సమావేశమై సమీకృత ఫామ్ ఫండ్ ద్వారా కలిగే ప్రయోజనాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన కల్పించారు.రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆధునిక, లాభదాయకమైన వ్యవసాయ విధానాలను అవలంబించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా పశువుల పెంపకం, భూగర్భ జలాల పెంపు, హార్టికల్చర్ సాగు, డ్రాగన్ ఫ్రూట్ సాగు వంటి కార్యక్రమాల ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందే అవకాశాలను వివరించారు. సమీకృత ఫామ్ ఫండ్ ద్వారా వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను అభివృద్ధి చేసుకోవడం వల్ల రైతుల ఆదాయం పెరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. రైతులు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆధునిక సాగు పద్ధతుల వైపు ముందుకు సాగాలని ఆమె సూచించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ వేంకటేశ్వర రావుతో పాటు సంబంధిత అధికారులు,రైతులు పాల్గొన్నారు.

# అమీనాబాద్‌లో పోషకాహార వారోత్సవాలు



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 10 ( జనం సాక్షి):** మండలంలోని అమీనాబాద్ గ్రామంలో పోషకాహార వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు మునుకుంట్ల రాధిక, సంధ్యారాణి, పాఠశాల ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

# ములుగులో జిల్లా రైస్ మిల్లర్ల మహాధర్నా

### నల్ల బ్యాడ్జీలతో నిరసన ర్యాలీ

### రైస్ మిల్లర్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్




**ములుగు ప్రతినిధి,సెప్టెంబర్10(జనం సాక్షి):**-ములుగు జిల్లా రైస్ మిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద రైస్ మిల్లర్లు మహాధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న రైస్ మిల్లర్లు హాజరై నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను తెలియజేశారు.అంతకుముందు ములుగు జిల్లా కేంద్రంలో జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా రైస్ మిల్లర్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ మాట్లాడారు. ప్రభుత్వం రైస్ మిల్లర్ల పట్ల అవలంబిస్తున్న తీరుకు నిరసనగా ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేమందరం నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు.గత యాసంగి,వానాకాలం సీజన్లలో ప్రభుత్వం తరపున మేము లక్షల క్వింటాళ్ల వడ్లను కస్టమ్ మిల్లింగ్ చేసి, ప్రభుత్వానికి బియ్యం అందించామని తెలిపారు.అయితే ఆ బియ్యానికి సంబంధించిన సీఎంఆర్ బకాయిలు, కస్టమ్ మిల్లింగ్ చార్జీలు ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.దీనివల్ల మిల్లర్లందరం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు.బ్యాంకుల నుండి తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని,మిల్లులు సైతం నడపలేని పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మా పెండింగ్ బిల్లులను పూర్తిగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ప్రస్తుతం ఉన్న కస్టమ్ మిల్లింగ్ చార్జీలు చాలా తక్కువగా ఉన్నాయని,కరెంటు చార్జీలు, కూలీల ఖర్చులు, హమాలీ ఖర్చులు విపరీతంగా పెరిగాయని తెలిపారు.కాబట్టి మిల్లింగ్ చార్జీలను పెంచాలని ఆయన కోరారు.కొన్ని చోట్ల అధికారులు లేనిపోని నిబంధనలు పెట్టి మిల్లర్లను వేధిస్తున్నారని,అట్టి వేధింపులను వెంటనే ఆపాలని అన్నారు.మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రైస్ మిల్లర్లమంతా నిరవధిక సమ్మె కొనసాగిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.అనంతరం తమ తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్ అసోసియేషన్ కార్యదర్శి సహోదరు రెడ్డి కోశాధికారి ఎలగందుల మోహన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్ గౌరవ అధ్యక్షులు పల్లెపాటి సమ్మిరెడ్డి మరియు జిల్లాలోని మిల్లర్లు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**వినాయక చవితి ఉత్సవాలు, శోభాయాత్ర, విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ లో నిమజ్జన ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం, గణపురం చెరువుల వద్ద క్రేన్లు, లైటింగ్, జనరేటర్లు, ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. కాళేశ్వరంలో 500కు పైగా విగ్రహాల నిమజ్జనం రెండు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉన్నందున 3 భారీ క్రేన్లు, లైటింగ్ టవర్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. శోభాయాత్ర జరిగే ప్రధాన రహదారుల్లో గుంతలను పూడ్చాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. 10 అడుగులకు పైగా ఎత్తున్న విగ్రహాల తరలింపులో విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖకు సూచించారు. గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లను సజావుగా పూర్తి చేయాలన్నారు. నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, మండపాల వద్ద 24 గంటల పర్యవేక్షణ ఉంచాలని ఆదేశించారు. మండప నిర్వాహకుల వివరాలను నమోదు చేయించడంతో పాటు ప్రతి మండపం వద్ద సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనం రోజున వైన్ షాపులు, బార్లు, కల్లు దుకాణాలు మూసివేసేలా ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, బ్లీచింగ్, లైటింగ్, మైక్ సిస్టమ్, తాత్కాలిక వేదికల ఏర్పాట్లను ముందే పూర్తి చేయాలని పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్పీ నరేష్ కుమార్, డీఆర్డీఓ వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, సింగరేణి జీఎం రాజేశ్వర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, డీఎంహెచ్ఓ డా. మధుసూదన్, డీపీఓ మల్లికార్జున రెడ్డి, ఇరిగేషన్, విద్యుత్, ఆర్ అండ్ బి, ఎక్సైజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సోమగూడెంలో ఓపెన్‌కాస్ట్ పేలుళ్ల ప్రభావం

### కూలిన ఇంటి నిర్మాణాలను పరిశీలించిన పీవో రాంబాబు



**కాసిపేట, సెప్టెంబర్ 10 : (జనం సాక్షి)**కళ్యాణిఖని ఓపెన్‌కాస్ట్ పేలుళ్లతో ప్రభావితమైన బెల్లంపల్లి మండలం సోమగూడెం(బీ)లో ఓ ఇల్లు కూలిపోయింది. గురువారం కూలిన ఇంటిని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు అధికారి రాంబాబు పరిశీలించారు. కూలిన గోడలు, దెబ్బతిన్న నిర్మాణాలను స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనకు చూపించి పరిస్థితిని వివరించారు.పగుళ్లు వచ్చి.. కూలిన గోడలు సింగరేణికి చెందిన పెద్ద కాలువ కల్వర్ట్ పక్కన ఉన్న గోడలకు పగుళ్లు ఏర్పడి, అనంతరం పక్కనే ఉన్న ఇంటి గోడలు, నిర్మాణాలు కూలిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఓపెన్‌కాస్ట్ పేలుళ్ల తీవ్రత కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని వివరించారు. ప్రభావిత కుటుంబానికి కూలిన గోడలు, నిర్మాణాలను సింగరేణి ఆధ్వర్యంలో తిరిగి నిర్మించి ఇవ్వాలని ప్రజాప్రతినిధులు పీవోను కోరారు.కాలువలో బండలు.. జేసీబీతో తొలగింపు ఇంటి నిర్మాణాలు కూలిపోవడంతో కాలువలో పెద్దఎత్తున బండరాళ్లు పడిపోయి నిండిపోయాయి. దీంతో అధికారులు వెంటనే జేసీబీని పంపించి బండలను తొలగించే పనులు చేపట్టారు. తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి కాలువను వినియోగంలోకి తెచ్చే చర్యలు ప్రారంభించారు.జీఎంతో మాట్లాడి పరిష్కరిస్తాం కాలువ గోడలను సింగరేణి ముందుగా పటిష్టంగా నిర్మించిన తర్వాతే పక్కనే కూలిపోయిన ఇంటి నిర్మాణాలను చేపట్టే అవకాశం ఉంటుందని పీవో రాంబాబు తెలిపారు. ఈ విషయంపై వెంటనే జీఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు దగ్గరుండి పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొన్నాల మౌనిక, బుగ్గ దేవాలయం చైర్మన్ దూడం మహేష్, నాయకులు ముత్తే భూమయ్య, పొన్నాల కనకరాజు, జైన శ్రీనివాస్, తోట సురేష్, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రశాంత్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్

- ఏఐ, లాంగ్వేజ్ డిటెక్షన్‌పై పరిశోధనకు గుర్తింపు
- సుమతి రెడ్డి ఇన్‌స్టిట్యూట్‌లో విభాగాధిపతిగా సేవలు




**వరంగల్ మండలం, సెప్టెంబర్ 10 (జనం సాక్షి)**నగరంలోని రామన్నపేటకు చెందిన బోలుకొండ ప్రశాంత్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. యూనివర్సిటీ 85వ స్నాతకోత్సవంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో ఆయనకు డాక్టరేట్ పట్టాను వైస్‌చాన్స్‌లర్ సీనియర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం చేతుల మీదుగా ప్రదానం చేశారు.ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ పానుగంటి విజయపాల్ రెడ్డి పర్యవేక్షణలో "ఫైన్ ట్యూనింగ్ ఆఫ్ మోడల్స్ ఫర్ పెట్రొనైజింగ్ అండ్ కండెసెంటింగ్ లాంగ్వేజ్ డిటెక్షన్ అండ్ కేటగరైజేషన్" అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు ప్రశాంత్‌కు డాక్టరేట్ లభించింది. ఉస్మానియా యూనివర్సిటీ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అధ్యక్షతన జరిగిన ఈ స్నాతకోత్సవానికి భారత్ బయోటెక్ చైర్‌పర్సన్ కృష్ణ ఎల్లా ముఖ్య అతిథిగా హాజరై డిగ్రీ గ్రహీతలను ఉద్దేశించి ప్రసంగించారు.డాక్టర్ బోలుకొండ ప్రశాంత్ ప్రస్తుతం సుమతి రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ విమెన్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ విభాగాలకు విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన డాక్టరేట్ సాధించిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. రాజశ్రీ రెడ్డి, మేనేజ్‌మెంట్ సభ్యులు, విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## గంగారం మండలంలో రైతు నమోదు కార్యక్రమం




**గంగారం, సెప్టెంబర్ 10: (జనం సాక్షి)**గంగారం మండలంలోని దుబ్బగూడెం, మామిడిగూడెం, మిర్యాలపేట, పోనుగొండ్ల గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు నమోదు (ఫార్మర్ రిజిస్ట్రేషన్) కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఏఈఓ కిషోర్ మాట్లాడుతూ, ప్రతి రైతు తప్పనిసరిగా రైతు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతు నమోదు కోసం రైతులు తమ ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు అనుసంధానమై ఉన్న చరవాణి నంబరును తీసుకుని వచ్చి నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతు నమోదు గుర్తింపు సంఖ్య లేని రైతులకు ఇకపై యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకునే అవకాశం ఉండదని, ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందడానికి కూడా ఈ నమోదు తప్పనిసరి అని స్పష్టం చేశారు. కావున మండలంలోని నాలుగు గ్రామాల రైతులు అందరూ నిర్లక్ష్యం చేయకుండా తమ గ్రామంలో జరుగుతున్న నమోదు కేంద్రానికి వచ్చి తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు.

## యూరియా యాప్ తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతన్నలు

### ఎంసిపిఐయు మండల కార్యదర్శి జన్ను రమేష్



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 10 ( జనం సాక్షి):** యూరియా యాప్ తో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎం సిపిఐయు మండల కార్యదర్శి జన్ను రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన యూరియా యాప్ తో రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.ఈ యూరియా యాప్ వల్ల సరైన టైంలో యూరియా అందడం లేదని అన్నారు. నెట్వర్క్ ప్రాబ్లం, యాప్ పై రైతులకు సరైన అవగాహన లేకపోవడం వల్ల చిన్న, సన్న కారు , కౌలు రైతులు అనేక తంటాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే యూరియా యాప్ ను రద్దుచేసి గతంలో ఇచ్చిన మాదిరిగా యూరియాను సరిపడా రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతులు తగిన బుద్ధి చెప్పడం ఖాయం అన్నారు.

# క్రీడలతో క్రమశిక్షణ, పట్టుదల,ఆత్మవిశ్వాసం పెంపొందుతాయి

- డ్రగ్స్‌కు దూరంగా ఉండండి.
- ఆరోగ్య కరమైనా భవిష్యత్తును నిర్మించుకోండి
- మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు
- మానుకోట జిల్లా ఎస్పీ డా.శబరీష్ వెల్లడి.



గూడూరు,సెప్టెంబర్10(జనంసాక్షి): క్రీడాలతో క్రమశిక్షణ,పట్టుదల ఆత్మవిశ్వాసం, పెంపొందితాయని మానుకోట జిల్లా ఎస్‌ఐ డాక్టర్ శబరిష్ పేర్కొన్నారు. గురువారం గూడూరు మండల కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్ (బాలుర) పాఠశాలలో నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గూడూరు జోనల్ స్థాయి క్రీడ పోటీలు, ఎంపికల కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డా. శబరీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థి క్రీడాకారులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు శారీరక,మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు.క్రీడాకారులు తమకు ఇష్టమైన క్రీడలో నిరంతరం సాధన చేస్తూ, గెలుపు--ఓటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఓటమిని నిరాశగా భావించకుండా ఒక సవాలుగా తీసుకుని మరింత పట్టుదలతో ముందుకు సాగాలని,క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, నిరంతర సాధనే విజయానికి పునాదులని పేర్కొన్నారు. విద్యార్థులు చెడు మార్గాలు, మాదకద్రవ్యాలు, ఇతర చెడు వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు.వ్యసనాలు యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదం ఉన్నందున,ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకుని విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే ఉద్దేశంతో కార్యక్రమంలో సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన పోస్టర్లను ప్రదర్శించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, సందేశాలు,ఆన్‌లైన్ ఆఫర్లకు స్పందించవద్దని సూచించారు.అలాగే "డ్రగ్స్‌కు దూరంగా ఉండండి – – ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోండి" అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు.క్రీడలు, విద్యల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే లక్ష్యంతో కృషి చేయాలని, తద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలతో పాటు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు,సీఐ వర్మ విన‌య్ కుమార్,ఎస్ఐ రమేష్ బాబు,సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు,పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

## ఖాదర్ పేట గ్రామ సర్పంచ్ గూడ సంధ్య మహేందర్




**చెన్నారావుపేట, సెప్టెంబర్ 10 ( జనం సాక్షి):** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని ఖాదర్ పేట గ్రామ సర్పంచ్ గూడ సంధ్య మహేందర్ అన్నారు.ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఖాదర్ పేట గ్రామంలో బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. పెండ్లి రాజలక్ష్మికి రూ.86 వేలు, కూస శ్రీను రూ. 44వేలు మంజూరు కాగా ఆ చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మధుకర్, వార్డు సభ్యులు పెండ్లి ఐలయ్య, వడ్డె రమేష్, ఉప్పుల దేవేందర్, పెండ్లి మల్లయ్య, రాజేందర్, దామెరుప్పుల సదయ్య, కూస కుమార్, చేవ యాదగిరి, వైనాల రవి, వడ్డె శంకర్, కేశపాక శ్రీను, ఎల్లమ్మ, పాల్గొన్నారు.

# బిజెపి పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి

## బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 10 ( జనం సాక్షి):** బిజెపి పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి చెన్నారావుపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల బిజెపి నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిజెపి పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు.పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో, క్రమశిక్షణతో పనిచేయాలని గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేసి, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం పాటుపడాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.ఈ సమావేశంలో బిజెపి మండల నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గిర్జన సంక్షేమ పాఠశాలలలోని ఉపాధ్యాయులను వేదిస్తున్న డిడిని తొలగించాలి



**గంగారం సెప్టెంబర్ 10 (జనం సాక్షి)** మహబూబాబాద్ జిల్లాలోని గిర్జన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల హెచ్ఎంఎస్, వార్డెన్‌లను మానసిక వేధింపులకు గురి చేస్తూ పర్వ పదజాలం తో ఇష్టారీతిన భూతు పురాణం మాటలతో మీకు కులపిచ్చి ఉంది అంటూ ఒక ఆదివాసీ మహిళా ప్రధానోపాధ్యాయురాలిని తన తోటి ఉపాధ్యాయ సిబ్బంది ముందు అసభ్యకరంగా మాట్లాడి కించపరిచి మనోవేదనకు గురి చేశారని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ తీవ్రంగా ఖండిస్తుంది, ఈ విషయమై జిల్లా సమన్వయ కర్త ఆలూరి రాజు మాట్లాడుతూ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పర్చే దిశగా పనిచేయాల్సిన జిల్లా గిర్జన సంక్షేమ అధికారి అన్ని పాఠశాలలలో ఇదే పద్ధతిని అవలంబిస్తూ ఉపాధ్యాయులను భయానక వాతావరణంలోకి నెట్టి తనకు ఎదురు మాట్లాడొద్దు నేను చెప్పింది చేయాలంటూ, కొత్తగా తాను అక్రమంగా2025,2026 సంవత్సరంలో నియామకం చేసిన కాంటిజెంట్ వర్కర్స్‌ను 2024లో నియామకం అయినట్లు రికార్డ్‌లో రాయాలని రాయ కుంటే మీ అంతు చూస్తానని సస్పెండ్ చేస్తా, బజారుకు ఈడుస్తా అంటూ బెదిరింపులకు దిగుతున్నాడని ఇందుకు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్స్ ఈ విషయం ఎవరికీ చెప్పుకోలేక తీవ్ర వత్తిడికి గురుతున్నారని ఇట్టి విషయమై, ఐటీడీఏ పిఓ డిడిని తొలగించి పాఠశాలల వారీగా సమగ్ర విచారణ చేసి డిడిని సస్పెండ్ చేయాలని లేని పక్షంలో ఐటీడీ ఏ ముందు ఆందోళన చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో అలెం జంపయ్య, కొప్పుల సోమయ్య, ఈక విజయకుమార్, మోకాళ్ళ సుధీర్‌లు పాల్గొన్నారు.

# మిల్లర్లను డిఫాల్టర్లుగా చిత్రీకరించడం సరికాదు

## రైస్ మిల్లర్స్ అసోసియేషన్




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రైస్ మిల్లింగ్ పరిశ్రమ సమస్యలను పట్టించుకోకుండా మిల్లర్లందరినీ డిఫాల్టర్లుగా చిత్రీకరించడం సరికాదని భూపాలపల్లి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెరుమాళ్ల తిరుపతి, గౌరవ అధ్యక్షుడు కోరే రవి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం కలెక్టరేట్ ఎదుట జరిగిన మహాధర్నాలో వారు మాట్లాడారు. గత పదేళ్లలో కేటాయించిన 9.70 కోట్ల టన్నుల ధాన్యంలో డిఫాల్ట్ 2శాతం కూడా లేదని, ఆ స్వల్ప శాతాన్ని చూపి మొత్తం పరిశ్రమను నిందిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గోదాముల్లో స్థలం లేదు, మిల్లుల్లో నిల్వలు పేరుకుపోయాయని, రబీ 2025-26 ధాన్యాన్ని వెంటనే వేలం వేయాలని డిమాండ్ చేశారు. ముడి బియ్యం కోసం అదనంగా కేటాయించిన 12 లక్షల టన్నులను ముడి బియ్యంగా ఇవ్వడం సాధ్యం కాదని, ఉడికించిన బియ్యంగా మార్చేందుకు అనుమతించాలని కోరారు. స్ట్రైక్స్, బ్రోకెన్స్, అకాల వర్షాలు, తేమ శాతం తగ్గడం వల్ల మిల్లింగ్ లో 18-20శాతం వరకు వాస్తవ నష్టాలు ఉంటాయని, వాటిని తనిఖీల్లో నమోదు చేయకుండా మిల్లర్లపై భారం మోపడం అన్యాయమన్నారు. ఓటీఆర్ పై సిఎస్టీఆర్ఐ నివేదికలను బహిర్గతం చేసి, ఆ ప్రకారమే ఓటీఆర్ అమలు చేయాలన్నారు. రైతుల కోసం 2025-26లో 154 లక్షల టన్నుల ధాన్య సేకరణకు సహకరించామని, పిడిఎస్ సన్నబియ్యం డెలివరీకి కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. 2014-25 వరకు పెండింగ్ పంటలకు వడ్డీ, జరిమానా లేకుండా పరిష్కారం చూపాలని కోరారు.

# చంద్రు తండాలో ఉచిత వైద్య శిబిరం

- ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- తిమ్మరాయిని పహాడ్ గ్రామ సర్పంచ్ ధారావత్ రమేష్



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 10 ( జనం సాక్షి):** మండలంలోని తిమ్మరాయిని పహాడ్ గ్రామంలోని చంద్రు తండాలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గురువారం చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యాధికారిని సరోజ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధారావత్ రమేష్ పాల్గొని మాట్లాడారు. గ్రామస్తులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తమ ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో సిహెచ్ఓ భద్రయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి కాసుల రాంబాబు, వార్డు సభ్యులు లావుడియా చందులాల్, హెల్త్ అసిస్టెంట్లు సురేందర్, సార్య నాయక్, సెకండ్ ఏఎన్ఎం సరిత, వైద్య సిబ్బంది, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత, సామాజిక న్యాయం దిశగా ప్రభుత్వం కృషి

### కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :**వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి అన్నారు. గురువారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని న్యూ శాయంపేట జంక్షన్ లో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి ఛైర్ పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, అధికారులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కుడా ఛైర్ పర్సన్ సుధారాణి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ కేవలం ఒక వర్గం కోసం పోరాడిన మహిళ కాదని, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరవనితగా చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయకుండా అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం ప్రతి ఒక్కరికీస్ఫూర్తిదాయకమన్నారు.చాకలి ఐలమ్మ పోరాటం మహిళా సాధికారతకు, ఆత్మగౌరవానికి, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిందని తెలిపారు. చాకలి ఐలమ్మ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని, ఆమె స్ఫూర్తిని నేటి తరానికి అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు ఎన్. రవి, వై వి గణేష్, ఎల్ కిషోర్ కుమార్, వరంగల్ ఆర్డీవో సుమ, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పుష్పలత, లక్ష్మణ్, మత్స్య శాఖ అధికారి శ్రీపతి, డాక్టర్ మధుచందర్, మాజీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, మాజీ కార్పొరేటర్ చీకటి ఆనంద్, మున్సిపల్, కుడా, ఇతర శాఖల అధికారులతో పాటు ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలి

### జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి,సెప్టెంబర్ 10(జనంసాక్షి).**విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. గురువారం ములుగు మండలం బండారుపల్లిలోని తెలంగాణ గురుకుల పాఠశాల (బాలుర), జూనియర్ కళాశాల ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, భోజనశాల, వసతిగృహం, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, బోధన, భోజన పట్టిక, సరుకుల నిల్వలకు సంబంధించిన నమోదులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వంటశాల, భోజనశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక వసతులను అందుబాటులో ఉంచాలని తెలిపారు.అనంతరం తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యాంశాల బోధన, భోజనం, వసతిగృహ సౌకర్యాలు, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు.ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను నిరంతరం పరిశీలిస్తూ, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని సూచించారు.కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి ఉన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల కోసం సాధించిన అగ్రిమెంట్లను అమలు చేయించే బాధ్యత ఏఐటీయూసీదే




**నస్పూర్‌సెప్టెంబర్ 10(జనంసాక్షి):**సింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతూ,యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి సాధించిన అగ్రిమెంట్లను చూసి ఇతర యూనియన్లు బిత్తరపోయి ఏఐటీయూసీపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య,ముస్కే సమ్మయ్య,ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా,అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్య అన్నారు.కార్మికుల సమస్యలపై పోరాడి అగ్రిమెంట్లు సాధించకుండా,ఇతరులు పోరాడి సాధించిన అగ్రిమెంటు పై విమర్శలు చేయడం ద్వారా కార్మికులను తప్పుదోవ పట్టించలేరని వారు స్పష్టం చేశారు.శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి-1గనిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో నాయకులు మాట్లాడుతూ,సింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ జూన్ 8న సమ్మె నోటీసు ఇచ్చి,కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా వాటి పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు నిర్వహించిందని తెలిపారు.అనంతరం ఆర్ఎల్‌సీ సమక్షంలో యాజమాన్యంతో పలుమార్లు చర్చలు జరిపి కార్మికుల డిమాండ్లపై స్పష్టమైన వైఖరితో ముందుకు వెళ్లామని, ఏఐటీయూసీ నిరంతర ఒత్తిడి, పోరాటాలు, చర్చల ఫలితంగానే పలు కీలక అంశాలపై యాజమాన్యంతో అగ్రిమెంట్లు సాధించామని చెప్పారు.కార్మికులకు ఏం కావాలో తెలుసుకుని ఆ సమస్యలను అగ్రిమెంట్ల రూపంలో పరిష్కరించే దిశగా తీసుకెళ్లడం ఏఐటీయూసీ విధానమని పేర్కొన్నారు.కార్మికుల ప్రయోజనాల కోసం ఏఐటీయూసీ పోరాడి సాధించిన అగ్రిమెంట్లలో పెర్క్‌పై విధించే ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యం భరించడం, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం, ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహణ, 2025--26 వాస్తవ లాభాలు దసరాలోపు చెల్లించుటకు అంగీకారం , ట్రాన్స్‌ఫర్ నిబంధనల్లో మార్పులు, అర్హులైన సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు ప్రమోషన్లు, డిపెండెంట్ ఉద్యోగాల పెండింగ్ కేసుల పరిష్కారం, 149 మంది మెడికల్ ఫిట్ డిపెండెంట్లకు ఆఫీస్ ఆర్డర్లు, ఖాళీ పోస్టుల భర్తీ, క్యాడర్ స్కీమ్, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ, కార్మికులకు సేఫ్టీ మెటీరియల్, డిస్మిస్ కార్మికుల సమస్య, మారుపేర్ల సమస్య తదితర 24 అంశాలపై అగ్రిమెంట్లు ఉన్నాయని నాయకులు వివరించారు. ఇవి కేవలం మాటల్లో చెప్పుకున్న హామీలు కాదని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ పోరాడి యాజమాన్యంతో చర్చల ద్వారా సాధించిన ఫలితాలని స్పష్టం చేశారు. మేము అగ్రిమెంట్లు చేశాం. కార్మిక కార్మికుల సమస్యలు కేవలం వేతనాలు, అలవెన్సులకు మాత్రమే పరిమితం కావని, వారి ఆరోగ్యం, కుటుంబాల భవిష్యత్తు, పిల్లల విద్య, ఉద్యోగ భద్రత, డిపెండెంట్ ఉద్యోగాలు, ప్రమోషన్లు, సంక్షేమం వంటి ప్రతి అంశంపై ఏఐటీయూసీ పోరాడుతోందని అన్నారు. హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మెడికల్ అటెండెన్స్ నిబంధనల్లో మార్పులు, సీబీఎస్ఈ సిలబస్ అమలు, డిస్మిస్ కార్మికుల పెండింగ్ కేసుల పరిష్కారం, ఈవెనింగ్ కాలేజీలకు ఎన్ఓసీలు వంటి అంశాలపై కూడా సాధించిన పురోగతిని కార్మికులు గమనిస్తున్నారని తెలిపారు. కార్మికుల సమస్యలను కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రస్తావించే రాజకీయాల కంటే, నిరంతరం కార్మికుల మధ్య ఉండి సమస్యల పరిష్కారం కోసం పోరాడే విధానమే ఏఐటీయూసీ విధానమని తెలియజేశారు.ఏఐటీయూసీ సాధించిన అగ్రిమెంట్లపై విమర్శలు చేస్తున్న ఇతర యూనియన్లకు నాయకులు సూటిగా సవాల్ విసిరారు.గేట్ మీటింగ్‌లో ఫిట్ సెక్రటరీ దాడి రాజయ్య,వైస్ ప్రెసిడెంట్ అనంతరెడ్డి, నాయకులు ఓదెలు,దహిత ప్రసాద్,అఖిల్ భరత్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రవీందర్ అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన నాయకులు



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్10(జనంసాక్షి):** తమ అభిమాన నాయకుడి అంతిమయాత్రకు మాజీ ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు పార్టీలకు అతీతంగా తరలివచ్చారు. తెలంగాణ ఉద్యమ నాయకుడు, సింగరేణి ఉద్యోగి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జె. రవీందర్ అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. గురువారం మందమర్రిలో నిర్వహించిన అంతిమయాత్రలో పలువురు నాయకులు పాల్గొని నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు తదితరులు పాల్గొన్నారు. బాల్క సుమన్, నల్లాల ఓదెలు డప్పు కొడుతూ రవీందర్‌తో తమకున్న అనుబంధాన్ని చాటుకున్నారు. అనంతరం రవీందర్ భౌతికకాయానికి పార్టీలకు అతీతంగా నాయకులు, అభిమానులు నివాళులర్పించారు.

# తాండూరు మండల కేంద్రంలో ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు



**తాండూర్, సెప్టెంబర్ 10(జనం సాక్షి):**తెలంగాణ వీరనారి, సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని తాండూరు మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షులు పెండ్యాల శ్రీనివాస్ ముఖ్య భూమిక పోషించి, కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నాడు దొరల అరాచకాలకు వ్యతిరేకంగా, భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన వీరోచిత పోరాటం తరతరాలకూ ఆదర్శనీయమని కొనియాడారు. .ఈ కార్యక్రమంలో తాండూరు మండల రజక సంఘం అధ్యక్షులు తాండూర్ నరేష్, ఉపాధ్యక్షులు చంద్రగిరి విగ్నేష్, కోశాధికారి చంద్రగిరి సాంబయ్య లతో పాటు మండలంలోని ప్రతి గ్రామం నుండి రజక సంఘం ప్రతినిధులు, సభ్యులు మరియు కులబాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి



**రెబ్బెన,సెప్టెంబర్10(జనం సాక్షి):**పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, చేపడుతున్న అభివృద్ధి పనులపై జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మత్ ఆరా తీశారు. గురువారం ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల్లో పర్యటించిన ఆయన బుర్గుడ, తల్లాలపల్లి గ్రామాల్లోని పూర్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల ఆవరణలను పరిశీలించి పెయింటింగ్, సుందరీకరణ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు ఆకర్షణీయమైన వాతావరణం అందేలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో సరదాగా మాట్లాడిన ఆయన వారి చదువు, పాఠశాలలోని వసతుల గురించి ప్రశ్నించారు. చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారిని ప్రోత్సహించారు. ప్రాథమిక విద్యకు బలమైన పునాది వేసేలా పాఠశాలల్లో అవసరమైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు



మహా ముత్తారం సెప్టెంబర్ 10 (జనం సాక్షి) చాకలి ఐలమ్మ 41 వర్ధంతి వేడుకలను జరిపించారు. గురువారం మండల కేంద్రంలో తెలంగాణ వీరనారి, రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడి రాజయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జాడి రాజయ్య మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాటం చేసిన మహనీయురాలు చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె చూపిన ధైర్యసాహసాలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమ చరిత్రలో చాకలి ఐలమ్మ పాత్ర చిరస్మరణీయమని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మహిళా సాధికారతకు, సామాజిక న్యాయానికి ఆమె చేసిన కృషిని స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, లింగమళ్ళ దుర్గయ్య,మహిళా మండల ఉపాధ్యక్షురాలు, భౌతు రమ్య, మహిళా మండల ప్రధాన కార్యదర్శి, లక్ష్మి,మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు, లింగమళ్ళ, రాజయ్య, సీనియర్ నాయకులు, గుంపుల రామయ్య, మోత్కురి రవి,కోరుకోపుల లింగయ్య,పోలం మల్లయ్య,మహాముత్తారం యూత్ టౌన్ అధ్యక్షులు, తాళ్లపల్లి సుధాకర్ గౌడ్,యూత్ కాంగ్రెస్ నాయకులు, జోడే విజేందర్, నీలాల రాజు, మరియు మరుపాక, రాజేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాటం స్ఫూర్తిగా తీసుకోవాలి

## ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య



వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ (చాకలి ఐలమ్మ) పోరాటాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య అన్నారు. గురువారం ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం హంటర్ రోడ్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సారయ్య మాట్లాడుతూ నిజాం సర్కార్కు వ్యతిరేకంగా భూస్వాములను గడగడలాడించిన చాకలి ఐలమ్మ అందరికీ ఆదర్శవంతురాలని అన్నారు. తెలంగాణ పోరాటం కూడా ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళా సాధికార ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బసవరాజ్ కుమారస్వామి, శ్రీమాన్, రమేష్, రాములు బాబు, నరిగ శ్రీనివాస్, గోరంటల రాజు, కొండమీద రాజన్ బాబు, రజక కుల పెద్దలు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

## మహమ్మద్ హబీబ్ పాషా



తాండూర్, సెప్టెంబర్ 10(జనం సాక్షి ) మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో గురువారం రోజున చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని జనసేన పెద్దపల్లి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల పార్లమెంట్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జనసేన జాతీయ కార్యదర్శి తల్లూరి రాముకి తాండూర్ మండల్ ఆటో యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా ఆటో కార్మిక సమస్యలను వివరించి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తల్లూరి రాము మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఏడు లక్షల యాభై వేల మంది ఆటో కార్మికుల సమస్యలపై అధ్యయనం చేసి, వారికి ఖచ్చితంగా న్యాయం జరిగేలా భవిష్యత్తు కార్యాచరణను రూపొందించి, జనసేన పార్టీ తరపున పూర్తి మద్దతు ప్రకటిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటివరకు 205 మంది ఆటో కార్మికులు చనిపోయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గతంలో కల్లబొల్లి కబుర్లు చెప్పి, రెండుసార్లు చర్చల పేరుతో కాలయాపన చేస్తూ రాష్ట్రవ్యాప్త సమ్మెను నీరుగార్చారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం దగ్గరపడిందని హెచ్చరించారు. ఇప్పుడు జరుగుతున్న వర్షాకాల శాసనసభ సమావేశాల్లోనే ఆటో కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, ఆమోదించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంలో ఆటో కార్మికులు కీలక పాత్ర పోషించారని, వారిని విస్మరిస్తే ప్రభుత్వాన్ని గద్దె దించే సత్తా కూడా ఆటో కార్మికులకు ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# వినాయక చవితి నేపథ్యంలో పోలీసుల ముందస్తు చర్యలు

## సిబ్బందికి సూచనలు.. డీజే నిర్వాహకులకు కౌన్సెలింగ్



రాయపర్తి,సెప్టెంబర్ 10 (జనంసాక్షి):వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు .ఇందులో భాగంగా వర్ధన్నపేట నూతన సీఐ సంజీవరావు గురువారం రాయపర్తి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. .ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు.అనంతరం డీజే సౌండ్ నిర్వాహకులు, యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించి,నిబంధనలకు అనుగుణంగా డీజేలను వినియోగించాలని సూచించారు.నిబంధనలు ఉల్లంఘించకుండా పండుగను ప్రశాంతంగా నిర్వహించాలని వారికి అవగాహన కల్పించి, తహసీల్దార్ సమక్షంలో బౌండ్ఓవర్ ప్రక్రియ చేపట్టారు.అలాగే వినాయక చవితి సందర్భంగా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా చెరువులు,మైలారం ప్రాంతాలను పోలీసు అధికారులు సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.ప్రజలు, వినాయక మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని, పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో రాయపర్తి ఎస్ఐ ముత్యం రాజేందర్,హెడ్ కానిస్టేబుల్ పొన్నం భాస్కర్, పోలీసు సిబ్బంది సంపత్,అనిల్ కుమార్, నవ్య, సునీత, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముఖం చాటేసిన వరుణుడు

- ఎండి పోతున్న వరి, పత్తి పంటలు
- పక్కనే గంగ ఉన్న చుక్క నీరు రాదు
- ఎత్తి పోతలు ఉత్త పోతలే
- ఆందోళనలో రైతులు





కౌటాల సెప్టెంబర్ 10 జనం సాక్షి ఎల్‌నినో ప్రభావం, వరుణుడి ముఖం చాటేయడంతో, ఎండల తీవ్రతకు పత్తి చేన్లు వాడిపోతుండగా, వరి పంటలు ఎండుముఖం పట్టాయి. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతన్నలు.. పెట్టిన ఖర్చు బూడిదలో పోసిన పన్నీరు అవుతుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గల గల పారుతున్న గంగ ఉన్న పంటలకు చుక్క నీరు రాదు,ఎత్తి పోతలు మూలాన పడ్డాయి,రైతుల కోసం అధికారులు హడావిడి చేయడం తప్ప రైతులకు ఒరిగింది ఏమి ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.కౌటాల మండల కేంద్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా,ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతన్నల ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఒకవైపు వానలు కురవకపోగా, మరోవైపు ఎండల తాకిడి విపరీతంగా పెరగడంతో పత్తి, వరి పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ఎండుతున్న వరి.. వాడుతున్న పత్తి ఎల్‌నినో ప్రభావం కారణంగా జూన్, జూలై, ఆగస్టు నెలల్లో వాన మబ్బులు వచ్చినా ఆశించిన వర్షాలు పడలేదు. ఈ వానాకాలం సీజన్‌లో కౌటాల మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. రోహిణీ కార్తెలో కురిసిన అడపా దడపా వర్షాలకు రైతులు పత్తి విత్తనాలు నాటారు. అయితే, దుక్కి దున్ని, విత్తనం నాటి, కలుపు తీసి, మందులు వేసే వరకు ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టారు.ఎండలతో వరి, పత్తి పంటలు ఎండిపోతున్నాయి. బోర్లు ఉన్న కరెంట్ రాదు కొంత మంది రైతులకు మోటారు బోర్లు ఉన్నప్పటికీ త్రి ఫేస్ కరెంట్ సరిగా రాక పంటలు ఎండిపోతున్నాయి.రోజుకు 10నుండి 12గంటలు త్రి ఫేస్ ఇస్తున్న అందులో ఎల్ సి ల పేరుతో,లైన్ బ్రేక్ లతో మరో 3గంటలు కటింగ్ చేస్తున్నారు. దాంతో బోర్లు ఉన్న పంటలు ఎండి పోయే పరిస్థితి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పుల పాలు అవుతామని దిగులు దత్తు పటేల్, రైతు తాటిపల్లి గ్రామం జూన్‌లో రోహిణీ కార్తెలో కురిసిన వర్షాలతో 7ఎకరంలో పత్తిని,3ఎకరాల్లో వరి సాగు చేశా. చేతికి వచ్చే సమయంలో వర్షాలు లేక ఎండ తీవ్రతకు చేను వాడిపోతోంది. పూత వచ్చే సమయంలో వర్షాలు రాక పూత రాలిపోతుండటంతో గత ఏడాది మాదిరిగా దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. పెట్టిన పెట్టుబడితో పాటు ఆరుగాలం శ్రమ భూమిపాలై, తీవ్రంగా నష్టపోయి అప్పులపాలవుతామనే దిగులు పట్టుకుంది.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): చిట్యాల చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను పట్టణ రజక సంఘం నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రామాలయంలోని అమరవీరుల స్తూపం వద్ద ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. స్త్రీ యొక్క శక్తిని నలుమూలల చాటుచెప్పిన ఐలమ్మ యొక్క ఆశయ సాధనకు యావత్ రజకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు పైతర ఓదెలు, కార్యదర్శి అంజలి, సహాయ కార్యదర్శి వీరస్వామి, కోశాధికారి బిక్షపతి, యూత్ అధ్యక్షుడు ఇల్లందుల శ్రీను, మల్లయ్య, సత్తయ్య, అరుణ్, రాములు పాల్గొన్నారు.

# ఐలమ్మ చేసిన నాటి పోరాటం యువత ఆదర్శంగా తీసుకోవాలి

### మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్



స్టేషన్ ఘన్‌పూర్,సెప్టెంబర్ 10 (జనం సాక్షి):ఐలమ్మ చేసిన నాటి పోరాటం యువత అధ్యయనం చేసి ఆదర్శంగా తీసుకోవాలనిమున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమా ర్ అన్నారు. ఈరోజు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యం లో కౌన్సిలర్ పొన్న రవి అధ్యక్షతన చాకలి ఐలమ్మ వర్ధంతి గురువారం ఘనంగా నిర్వ హించారు. పట్టణ కేంద్రంలోని ఐలమ్మ విగ్రహా నికి మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. చైర్మన్ తో పాటు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, రజక సంఘం నాయకులు, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణలో దొరలు, భూస్వాముల పెత్తనానికి వ్యతిరేకంగా పేదలు, రైతులు, కూలీల హక్కుల కోసం ఐలమ్మ ధైర్యంగా పోరాడారని అన్నారు. తన కు ఎదురైన అణచివేతకు భయపడకుండా పోరాడి ప్రజల్లో స్ఫూర్తిని నింపారని గుర్తుచే శారు. ఐలమ్మ పోరాటం కేవలం ఒక వ్యక్తి భూమి కోసం చేసిన పోరాటంకాదని, పేదలు, రైతులు,కూలీల ఆత్మగౌరవం, భూమి, హక్కు ల కోసం సాగిన ప్రజా పోరాటానికి ప్రతీక అని అన్నారు. ఆమె చూపిన పోరాట మార్గం నేటి తరాలకు కూడా ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పొన్న రవి, పొన్న రాజేష్ గుర్రం హరినాథ్ ,బొల్లు లక్ష్మి, అంగడి అనిత,బూర్ల రాజేశ్వర్,తాటికొండ మధు,రజక సంఘము నాయకులు పొన్న సత్యనా రాయణ, పొన్న రమేష్ , రిటైర్డ్ ఉద్యోగి పొన్న రమేష్ , పొన్న మధు, పొన్న శ్రీకాంత్, పొన్న గౌతమ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజు , కొలిపాక సతీష్, మాజీ ఎంపీటీసీ గట్టు రమేష్ ,పెసరు సారయ్య, గట్టు రమేష్, మామిండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది

### : సమ్మిగౌడ్



కేసముద్రం, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు,వారి కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని కేసముద్రం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిలువేరు సమ్మిగౌడ్ అన్నారు.మండలంలోని కోరుకొండపల్లి గ్రామంలో ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందిన గాదగోని కొమురయ్య,పోలెపాక సాంబయ్య కుటుంబాలను సమ్మిగౌడ్ స్వయంగా వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, వారికి భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం రెండు కుటుంబాలకు 75 కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ యాసాడి బాలాజీ రెడ్డి, నాయకులు సట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న పార్టీ కార్యకర్తలు,వారి కుటుంబాలకు సమ్మిగౌడ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మెడి ఉపేందర్, మాజీ సర్పంచ్ నాగెల్లి శ్రీనివాస్, సామల నరసయ్య, భీరం గోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్, ఆర్ఎంపీ వెంకన్న, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో అవగాహన సదస్సు

### సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబూలాల్



ఆత్మకూర్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి): ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో మండలంలోని అన్ని గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వాహకులతో ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబులాల్ మీటింగ్ నిర్వహించి వారికి సూచనలు చేశారు. అవి ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, గణేష్ మండపాలు ప్రజా రవాణాకు ఎమర్జెన్సీ వాహనాలకు, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో పర్మిషన్ తీసుకోవాలని, డీజే లు ఏర్పాటు చేయరాదని, రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్స్ వినియోగించాలని, మండపంలో రౌండ్ ద క్లాక్ ఒక వాలంటీర్ ఉండాలని, మండపంలో ప్లేయింగ్ కార్డ్స్ ఆడదం వంటివి చేయరాదని, పాయింట్ బుక్ ఏర్పాటు చేయాలని, ఏదైనా సమస్య ఉంటే డయల్ 112 కు కాల్ చేయాలని తెలంగాణ పోలీస్ వెబ్ సైట్ లో గణేష్ నమోదు కోసం ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూర్ ఎస్సై తిరుపతి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాత్రివేళ విద్యుత్ కోతలు నివారించాలి

### విద్యుత్ శాఖ ఏడీకి వినతిపత్రం అందజేసిన వరికెల కిషన్ రావు



పరకాల,సెప్టెంబర్10,(జనం సాక్షి): పరకాల నియోజకవర్గ పరిధిలో గత వారం రోజులుగా రాత్రివేళల్లో తరచూ విద్యుత్ కోతలు విధించడం వల్ల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు అన్నారు.ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పరకాల విద్యుత్ శాఖ ఏడీ కి వరికెల కిషన్ రావు మరియు సురావు బాబు రావు కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వారం రోజులుగా ప్రతిరోజూ రాత్రి సమయంలో సుమారు 40 నుంచి 60 నిమిషాల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని, విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో వ్యవసాయ మోటార్లు నడపలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఇప్పటికే వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం తదితర కారణాలతో రైతులు పంటల విషయంలో ఆందోళన చెందుతున్నారని, దీనికి తోడు వ్యవసాయ విద్యుత్ కోతలు రైతుల కష్టాలను మరింత పెంచుతున్నాయని అన్నారు. విద్యుత్ కోతల వల్ల రైతులతో పాటు పిల్లలు, వృద్ధులు, మహిళలు, సాధారణ ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించాలని, రాత్రివేళల్లో విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సురావు బాబురావు పాల్గొన్నారురైతుల సమస్యను అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి వెంటనే విద్యుత్ అంతరాయాలను పరిష్కరించాలని వరికెల కిషన్ రావు డిమాండ్ చేశారు.

# గణపతి మండపాల ఏర్పాటుకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

### పట్టణ ఎస్సై జాడి శ్రీధర్



రామ కృష్ణాపూర్,సెప్టెంబర్ 10 (జనంసాక్షి):వినాయక చవితి సందర్భంగా గణేష్ మండపాలు ఏర్పాటు చేసే ఆయా నిర్వహకులు తప్పనిసరిగా ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ చేసి, పోలీస్ స్టేషన్ లో అనుమతి పొందాలని పట్టణ ఎస్సై జాడి శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నిబంధనలకు లోబడి మండపాలను నిర్మించి పోలీసులకు సహకరించాలన్నారు. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాతనే అనుమతి లభిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో పట్టణంలోని గణేష్ మండపాల నిర్వహకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్క పెరుగుదల పోషకాలపై క్షేత్ర ప్రదర్శన


### రైతులకు శిక్షణ కార్యక్రమం



కౌటాల సెప్టెంబర్ 10 జనం సాక్షి :పంట పోషకాలపై రైతులకు శిక్షణ కార్యక్రమం, సమగ్ర పోషకాలపై వ్యవసాయ అధికారులు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.గురువారం మండలం లోని నాగేపల్లి గ్రామ పంచాయతీ లో నిర్వహించిన కార్యక్రమం లో రైతులకు పత్తి పంటలో సమగ్ర పోషక యాజమాన్యం ఎలా చేయాలో, పురుగు మందులు, తెగులు మందులు, పోషక మందులు,మొక్కల పెరుగుదల నియంత్రిని(గ్రోత్ రెగ్యులేటర్ )ఎంత మోతదులో వాడాలో రైతులకు తెలిపారు.అనంతరం క్షేత్ర ప్రదర్శన లో భాగంగా వివిధ రకాల తెగుళ్లు, పురుగులు అవి నష్టం చేసే విధానంను గురించి, నివారణ చర్యలు గురించి రైతులకు వివరించారు.ఒక ఎకరాకు సంబంచిన సమగ్ర పోషక యాజమాన్యం కు సంబందించిన మందులను రైతుకు ఉచితంగా అందజేయడం జరిగింది.డిజిటల్ క్రాప్ బుకింగ్ లో భాగంగా ప్రతి ఒక్క రెవిన్యూ గ్రామానికి వాలంటీర్ ద్వారా ప్రతి ఒక్క సర్వే నెంబర్ లో వేసిన పంటలను వ్యవసాయ విస్తరణ అధికారి సమక్షంలో పంటల వివరాలు నమోదు చేయడం జరుగుతుంది అని తెలిపారు.డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే ఈ నెల 30 తారీకు వరకు గడువు ఉందని అన్నారు.కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకట్, గ్రామ సర్పంచ్ కావుడే. బిక్కు పటేల్, వ్యవసాయ విస్తరణ అధికారి సీ హెచ్. అంజన్న,గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పట్నాపూర్‌లో ఘనంగా పోలాల అమావాస్య వేడుకలు

### భక్తిశ్రద్ధలతో ఎడ్లను అలంకరించి పూజలు చేసిన రైతన్నలు



జైనూర్, సెప్టెంబర్10 (జనం సాక్షి)మండలంపట్నాపూర్ గ్రామం లో పోలాల (పోలా) అమావాస్య వేడుకలను గురువారం గ్రామ స్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏటా శ్రావణ బహుళ అమావాస్య సందర్భంగా నిర్వహించే ఈ పండుగలో గ్రామ ప్రజలు, అన్నదాతలు ఉత్సాహంగా పాల్గొన్నారు.పశువుల విశిష్ట పూజలు:వ్యవసాయంలో కీలక పాత్ర పోషించే పశువులను, ఎడ్లను రైతులు ఉదయాన్నే స్థానిక చెరువులు, వాగుల వద్దకు తీసుకెళ్లి శుభ్రంగా కడిగారు. అనంతరం వాటి కొమ్ములకు రంగులు వేసి, పూలమాలలు, మువ్వల పట్టెడలు, గజ్జెలతో అందంగా అలంకరించారు. గ్రామ పురవీధుల్లో మేళతాళాలు, డప్పు చప్పుళ్ల నడుమ ఎడ్లను ఊరేగించి, ప్రత్యేక పూజలు సమర్పించారు. రైతులకు వెన్నుదన్నుగా నిలిచే మూగజీవాలకు నైవేద్యాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. సంతాన సౌభాగ్య పూజలు:మరోవైపు మహిళలు పోలాల అమావాస్య సందర్భంగా కంద మొక్కను లక్ష్మీస్వరూపంగా భావించి పసుపు, కుంకుమలు, పూలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో నోము ఆచరించారు. తమ పిల్లల ఆయురారోగ్యాలు, కుటుంబ సౌభాగ్యాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించి, ముత్తైదువులకు వాయనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ పూసం హనుమంతరావు, చాటే, మహేష్, పూసం, ముండే సంజు,జగన్నాథరావు, పూసం తులసీరామ్,పాల్గొన్నారు.

# దోపిడీ, పీడన ఉన్నంత కాలం మార్క్సిజమే ఉంటుంది



**గంగారం సెప్టెంబర్ 10 (జనం సాక్షి)** ప్రజలపై దోపిడీ పీడన ఉన్నంతకాలం మార్క్సిజం ఉంటుందని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాయం చిన్న చంద్రన్న అన్నారు. గంగారం- కొత్తగూడ మండలాల ముఖ్య కార్యకర్తలకు జనరల్ బాడీ పందెం గ్రామంలో నేడు జరిగింది. ఈక బిక్షం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రన్న మాట్లాడుతూ వెనకబడిన ఏజెన్సీ ప్రాంతాలలో ఆదివాసి, గిరిజన ఇతర పేద ప్రజలకు అండగా నిలబడి భూమిని సంపాదించి పెట్టడంలో విప్లవకార్ల కృషి త్యాగం గొప్పదన్నారు. పాలకవర్గ పార్టీల భ్రమలలో కొందరు కమ్యూనిస్ట్ విప్లవ పార్టీల పని ఐపోయిందనే తప్పుడు ప్రచారం తాగదన్నారు. అవినీతి అక్రమాలు తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తూ మధ్యపరుస్తున్న పాలకవర్గ పార్టీల అబద్ధపు మాటలు నమ్మొద్దు అన్నారు. ప్రజల ఐక్యంగా త్యాగాలతో పోరాడి సాధించుకున్న హక్కులను చైతన్యవంతంగా కాపాడుకోవాలని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతు పంటకు గిట్టుబాటు ధర చట్టం చేయలేదని, పెరిగిన ఎరువులు, పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలను తగ్గించలేదని ఆరోపించారు. కలిసున్న ప్రజల మధ్య మతం చిచ్చు పెట్టడంలో ఆర్ఎస్ఎస్ బిజెపి ప్రభుత్వం కుట్రలు అనేకం చేస్తుందని అన్నారు. ఫాసిస్ట్ తరహా పరిపాల సాగిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఐక్య పోరాటాలు చేయాలన్నారు. సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి మాట్లాడుతున్న 421 హామీలకు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వాటి అమలులో విఫలం లేదని అన్నారు. కాంగ్రెస్,టీఆర్ఎస్ పరస్పర విమర్శలు దాడులతో ప్రజా సమస్యలు గాలికొదిలి కాలయాపన చేస్తున్నారని అన్నారు.ప్రజా పోరాటాలే పాలకవర్గాలకు నిజమైన ప్రత్యామ్నాయంగా నిలవాలని పిలుపునిచ్చారు. సిపిఐ మాస్ లైన్ మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి పూనెం ప్రభాకర్ మాట్లాడుతూ గంగారం కొత్తగూడ మండలాలలో ఎండుతున్న పంటలను అధికారులు వెంటనే సర్వే చేయాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొంది సమ్మయ్య కురుసం రంగయ్య జోగారామయ్య పూనం రవికుమార్ చిత్తారి పాపయ్య వాసం పాపయ్య కురుసం సురేష్ నాగేశ్వరరావు బుచ్చి రాములు నారాయణరెడ్డి వసంతరావు కల్తీ ఎర్రక్క సతీష్ సురేష్ వీరస్వామి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఎండిన పంటలను అధికారులు సర్వేలు చేయాలని, ప్రతి ఎకరాకు 30000 పంట నష్టపరిహారం ఇవ్వాలని, పెరిగిన ఎరువుల ధరలు తగ్గించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు చేయాలని పలు సమస్యలపై జనరల్ బాడీ జనరల్ బాడీ తీర్మానాలను ఆమోదించింది..

# మేడపల్లి పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ



**నల్లబెల్లి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** మండలంలోని మేడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ బి. రాజారెడ్డి గురువారం ఆకస్మికతనికి చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. పీహెచ్‌సీలోని వివిధ రికార్డులను తనిఖీ చేసి, వైద్య సేవల నిర్వహణ, సిబ్బంది పనితీరు తదితర అంశాలను సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని సూచికల్లో (ఇండికేటర్లు) మెరుగైన ఫలితాలు సాధించేలా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందిస్తూ పీహెచ్‌సీ పనితీరును మరింత మెరుగుపరచాలని డీఎంహెచ్ఓ సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్యోతి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఆత్మ పథకం ద్వారా రైతులకు శిక్షణ కార్యక్రమము



**కాళేశ్వరం , సెప్టెంబరు 10 , ( జనం సాక్షి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలం కాళేశ్వరం రైతువేదిక యందు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న వ్యవసాయ విస్తరణ సబ్ -మిషన్ కింద రాష్ట్ర విస్తరణ కార్యక్రమాలకు మద్దతు ఆత్మ పథకంలో భాగంగా గురువారం పూర్వ జ్ఞాన గుర్తింపు మరియు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమము నిర్వహించడం జరిగింది. రైతులు వారి నైపుణ్యాలను మెరుగుపరచడానికి పూర్వ జ్ఞాన గుర్తింపు తోడ్పడుతుంది. ఇట్టి శిక్షణ కార్యక్రమాల ద్వారా రైతులకు గ్రామీణ యువతకు సామర్థ్య పెంపు ,నైపుణ్యాభివృద్ధి మరియు మద్దతు సేవల గూర్చి సమగ్రంగా వివరించడం జరిగింది. అలాగే రైతులకు అవసరమైన జ్ఞానాన్ని, సాంకేతికతను, నైపుణ్యాలను మరియు మార్కెట్ సమాచారాన్ని అందించి సాగులో డిజిటల్ సాంకేతికతలు మరియు యాప్‌ల వినియోగాన్ని ప్రోత్సహించడం, సాంప్రదాయ పద్ధతులతో పాటు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, సరికొత్త సాగు పద్ధతులు మరియు మార్కెట్ ఆధారిత అంశాలపై రైతులకు స్వల్పకాలిక శిక్షణ ఇచ్చి వారి నైపుణ్యాలను ఆధునీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి బొల్లపెల్లి శ్రీజ, స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు రామ్ బాబు , రచన, ధర్మేందర్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా సాకలి ఐలమ్మ వర్ధంతి



**మల్లూర్, సెప్టెంబర్ 10(జనంసాక్షి)** మండలంలోని కొయ్యూరు గ్రామంలో రజక సంఘం మండల అధ్యక్షులు పావురాల ఓదెలు ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు, కొయ్యూరు సర్పంచ్ కొండ రాజమ్మ హాజరై మాట్లాడుతూ ఆ రోజులలో రజాకారులను ఎదిరించి భూమికోసం, భుక్తి కోసం, ఆత్మగౌరవం కోసం వీరోచితంగా పోరాటం చేశారు అని అన్నారు.పేద ప్రజల గురించి ఐలమ్మ పోరాటం చాలా గొప్పది ఐలమ్మ ఆశయాలకు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇ ప్పలపల్లి సర్పంచ్ లింగమూర్తి, కొయ్యూరు ఉప సర్పంచ్పాపేందర్, గ్రామ సెక్రెటరీ రాజు,ఇప్పలపల్లి ఉపసర్పంచ్ దేవేందర్, బీసీ సంఘం జిల్లా ఇంచార్జి విజయగిరి సమ్మయ్య, రాజయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కెరమెరిలో పోలాల అమావాస్య పండుగ

**హర్భోలా.. హర..హర.. మహాదేవ్. ఆకట్టుకున్న బసవన్నల ప్రదర్శన. ప్రత్యేక పూజలతో వేడుకల ముగింపు.**

**కెరమెరి, సెప్టెంబర్ 10(జనంసాక్షి)** కెరమెరి మండల కేంద్రంలోని సకారంగూడలో పోలాల అమావాస్య పండుగను రైతులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరుపుకున్నారు. రైతులకు వ్యవసాయంలో తోడుగా నిలిచే బసవన్నలను (ఎద్దులను) ఈ రోజు దైవంగా భావించి పూజించడం ఈ పండుగ విశిష్టత. ఈ సందర్భంగా రైతులు తమ ఎద్దులకు ఉదయాన్నే శుభ్రంగా స్నానం చేయించి, కొమ్ములకు రంగులు వేసి, మెడలో గజ్జలు, పూల దండలు, రంగురంగుల జూలాలు, అలంకరణ వస్త్రాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం హనుమాన్ మందిరం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితుడు మంత్రోచ్ఛారణల మధ్య బసవన్నలకు హారతి ఇచ్చి, నుదుటన కుంకుమ బొట్టు పెట్టి పూజలు చేశారు. తమ పంటలు బాగా పండాలని, ఎద్దులకు ఎటువంటి ఆపద రాకూడదని రైతులు మొక్కుకున్నారు. పూజ అనంతరం అలంకరించిన బసవన్నలతో హనుమాన్ మందిరం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. చిన్నారులు, మహిళలు, పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని బసవన్నలకు మొక్కుతూ, పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. గ్రామంలో ఎద్దుల ఊరేగింపు ఆకట్టుకుంది. రైతులు తమకు జీవనాధారమైన బసవన్నల పట్ల కృతజ్ఞత తెలిపే పండుగే పోలాల అమావాస్య అని, ఈ పండుగ రైతు-పశువుల మధ్య ఉన్న అనుబంధానికి ప్రతీక అని గ్రామ పెద్దలు తెలిపారు.





# ఘనంగా చిట్యాల ఐలమ్మ 41 వ వర్ధంతి



**వరంగల్ ఎంజీఎం, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** ఈరోజు రంగసాయిపేట జంక్షన్లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ గారి 41 వ వర్ధంతిని పురస్కరించుకొని ఘనంగా నివాళులు అర్పించి అనంతరం హాజరైన నాయకులు మాట్లాడుతూ ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ జేఏసీ చైర్మన్ రజక విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ కత్తెరపల్లి దామోదర్ జ్యోతిరావు పూలే సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు కేడల ప్రసాద్, మైదం సంజీవ, టిఆర్ఎస్ నాయకులు కోల గోపాల్, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఉసిల్ల కుమార్ , కలకోట్ల కుమారస్వామి, బజ్జురి లక్ష్మణ్, పూజారి విజయ్,గాదె కిరణ్,మైదం రూప, బొజ్జం మంజుల తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# చాగల్ లో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



**స్టేషన్ ఘన్‌పూర్,సెప్టెంబర్ 10 (జనం సాక్షి)** :స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్ లో మున్సిపల్ కౌన్సిలర్ పొన్న రాజేష్ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పొన్న రాజేష్ గురు వారం చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భం గా రాజేష్ మాట్లాడుతూ తెలంగాణ సాయు ధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు. తెలంగాణ విముక్తి ఉద్యమంలో నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం సాగిన పోరులో కీలక భూమిక పోషించారన్నారు. తెలంగాణ వీర నారి ఉద్యమమే ఊపిరిగా, పేదల అభివృద్ధే ధ్యేయంగా, వెట్టిచాకిరి విముక్తిని పారద్రోలి, భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన ధీశాలి మన చాకలి ఐలమ్మ అని అన్నారు. చాకలి ఐలమ్మ గారి వర్ధంతి వేడుకలే కాదు ఆమె ఆశయాల సాధనకు నేటి యువత అడుగు లు వేయాలనీ ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.ఐలమ్మ ఆశయాలు సాధిస్తాం ఐలమ్మ చేసిన నాటి పోరాటం యువత అధ్యయనం చేసి ఆదర్శంగా తీసుకోవాలి మన తెలంగాణ స్టేషన్ ఘన్పూర్ భూస్వాములు, దొరల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో నేటి ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాలని సిపిఎం స్టేషన్ ఘనపూర్ మండల కమిటీ సభ్యుడు సిద్దుల సుదర్శన్ పిలుపునిచ్చారు.చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా మండలంలోని తాటికొండ గ్రామంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివా ళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారపాక సుజనా శ్రీనివాస్, అక్కెనపల్లి అంజయ్య, అక్కెనపల్లి వెంకటయ్య, సిద్దుల సుదర్శన్,డాక్టర్ బిక్షపతి,గాజుల రమేష్ , వార్డు సభ్యులు వైట్ల బిక్షపతి, నాగరాజు, నాయకులు తూర్పాటి కనకయ్య, శ్రీనివాస్, గయాస్, రాజు, అక్బర్, కారోబార్ ఎండి సలీం, నరేష్ గ్రామపంచాయతీ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జోనల్ స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం




**మహబూబాబాద్, సెప్టెంబర్ 10(జనం సాక్షి)**:మహబూబాబాద్ జోనల్ స్థాయి మహబూబాబాద్ బయ్యారం గార్ల మండలాల స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి.ఈ సమావేశానికి సభాధ్యక్షులు కంబాలపల్లి ప్రధానోపాధ్యాయులు శ్రీమతి గిరిజన వ్యవహరించారు. ఈ క్రీడా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి క్రీడాకారులను ఉద్దేశించి నాకు క్రీడలు అంటే ఇష్టం నేను ఖోఖో క్రీడలో రాష్ట్ర మరియు జాతీయస్థాయి పోటీలలో పాల్గొన్నాను అని తెలిపారు. క్రీడల్లో రాణించడం వల్లనే నేను ఈ స్థాయికి చేరుకున్నాను అని, క్రీడల యొక్క ప్రాధాన్యతను వివరించారు. క్రీడాకారులు క్రీడలను క్రీడాస్ఫూర్తి గా తీసుకోవాలని గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని క్రీడలలో గెలుపు ఓటములు సహజమని తెలియజేశారు. గెలుపొందినప్పుడు ఆనందంగా ఓటమిపాలైనప్పుడు కృంగిపోవద్దని అన్నారు. క్రీడల ద్వారా జీవితంలో క్రమశిక్షణ అభివృద్ధి అవుతుంది, విద్యార్థిని విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పైన కూడా ఆసక్తి చూపాలని అప్పుడే విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధి చెందుతారు. ఉన్నత స్థాయిలో ఉంటారని విద్యార్థులను విద్యార్థిని విద్యార్థులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథి ఇంచార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారి మందుల శ్రీరాములు, అతిథులు కంబాలపల్లి సర్పంచ్ శ్రీమతి చీరిక వసంత ఉపేందర్ రెడ్డి, మహబూబాద్ విద్యాశాఖ అధికారి ఆరుద్ర వెంకటేశ్వర్లు, స్ఫూర్తి రూరల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు శ్రీరామ సహాయం శ్రీధర్ రెడ్డి, బిక్కీ వెంకటేశ్వర్లు, కంబాలపల్లి ఉపసర్పంచ్ కమటం యాకన్న, శ్రీమతి సిరంశెట్టి విజయ, కొమిరే ఉప్పలయ్య, ఆవారి శ్రీనివాస్, బానోతు చాంప్లానాయక్, వ్యాయామ ఉపాధ్యాయుడు మహంకాళి వెంకటేశ్వర్లు, వివిధ మండలాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు ఘన సన్మానం




**నర్సంపేట, సెప్టెంబర్ 10: (జనం సాక్షి** )నర్సంపేట పట్టణంలోని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచి, ఉన్నత పదవులకు ఎన్నికైన మరియు ఉత్తమ సేవలకు గుర్తింపు పొందిన అసోసియేషన్ సభ్యులను ఘనంగా సన్మా నించిన కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగిశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఖానాపురం మండలం పి ఆర్ టి యు. మండల అధ్యక్షులుగా ఎన్నికైన అల్వాల భిక్షపతి, పద్మశాలి సంఘం జనరల్ సెక్రటరీగా ఎన్నికైన పెండెం భాస్కర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా ఎన్నికైన మోతే ఇంద్రసే నారెడ్డి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జరుపుల భద్రు, మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన భూక్య రాజలింగం, పద్మశాలి సంఘం సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన పెండెం రాజులను. ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు నాగిశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ, వాకర్స్ అసోసియేషన్ కేవలం ఆరోగ్య పరిరక్షణకు మాత్రమే పరిమితం కాకుండా, సభ్యుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే ఆత్మీయ కుటుంబంగా ముందుకు సాగుతోందని అన్నారు. అసోసియేషన్ సభ్యులు వివిధ రంగాల్లో సాధిస్తున్న విజయాలు తమందరికీ గర్వకారణమని, ఒకరి విజయాన్ని మరొకరు ప్రోత్సహించుకోవడం ద్వారా సమాజంలో సానుకూల వాతావరణాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు."మన సభ్యుల విజయాలు వ్యక్తిగత విజయాలు మాత్రమే కాదు… అవి మొత్తం వాకర్స్ అసోసియేషన్ కుటుంబానికి గర్వకారణం. ప్రతిభను గుర్తించడం, సేవలను గౌరవించడం, విజయాలను అభినందించడం మనందరి బాధ్యత" అని నాగిశెట్టి ప్రసాద్ పేర్కొన్నారు.పద్మశాలి సంఘం సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన పెండెం రాజులను. ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గాజుల సాంబయ్య, మేర్గాల రామాజు, దూపటి కృష్ణమూర్తి, అబ్బరవోయిన వెంకన్న, కుతూరు వీరారెడ్డి, జూలపల్లి రాజేశ్వరరావు, గద్దె శ్రీనివాసరావు, బండి సుధాకర్, వంకాయలపాటి భద్రి, వడిచర్ల సురేష్, కొలువుల శ్రీనివాసు తదితర వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.వాకర్స్ అసోసియేషన్ సభ్యుల మధ్య ఆత్మీయత, ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, సభ్యుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే ఇలాంటి అభినందన కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

## ఆత్మకూర్ సీఐని కలిసిన మండల నాయకులు




**ఆత్మకూరు, సెప్టెంబర్ 10 (జనం సాక్షి)**:ఆత్మకూర్ సీఐ ని మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి పలు విషయాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పరకాల నియోజకవర్గం సేవాదళ్ అధ్యక్షులు ఏరుకొండ రవీందర్ గౌడ్, జడ్పీటీసీ కక్కెర్ల రాజు, ఆత్మకూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ రేవూరి జైపాల్ రెడ్డి, అలువాల రవి, రాయరాకుల శంకర్, కాడబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

## భద్రతా పరంగా మురళీమోహన్ సేవలు ప్రశంసనీయం

### జీఎం రాజేశ్వర్ రెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, సెప్టెంబర్ 10 (జనం సాక్షి)(జనంసాక్షి)**: భద్రతా పరంగా భూపాలపల్లి ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ ఎస్. మురళీమోహన్ అందించిన సేవలు ప్రశంసనీయమని ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి అన్నారు. బదిలీపై ఆర్జీ–1 ఏరియాకు వెళ్తున్న మురళీమోహన్ కు గురువారం జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మురళీమోహన్ ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. భూపాలపల్లి ఏరియాలో భద్రతా ప్రమాణాల అమలు, విధి నిర్వహణలో ఆయన చూపిన అంకితభావాన్ని జీఎం కొనియాడారు. ముఖ్యంగా పోలీసు శాఖ అధికారులతో సమన్వయాన్ని బలోపేతం చేయడంలో, సంస్థ భద్రతకు సంబంధించిన అంశాల్లో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆర్జీ–1 ఏరియాలో కూడా సమర్థవంతంగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం పొరక్, ఏజీఎం (ఐఈడీ) జ్యోతి, ఓసీ–2 ప్రాజెక్టు ఆఫీసర్ డి.శ్యామ్ సుందర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మాటూరి రవీందర్, ఏరియా ఇంజనీర్ పి.వి.శంభశివరావు, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యామ్ సుందర్, 1 గ్రూప్ ఏజెంట్ ఎం.తిరుపతి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకం

### అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, సెప్టెంబర్ 10 (జనంసాక్షి)**:చాకలి ఐలమ్మ త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, నేటి యువత ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని న్యాయం, సమానత్వం, సామాజిక చైతన్యం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇందిర, మెప్మా పీడీ రాజేశ్వరి, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు పున్నం రవి తదితరులు పాల్గొన్నారు.

# నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర కమ్యూనిస్టులదే

- సెప్టెంబర్ 11 నుండి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు
- సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి




**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర కమ్యూనిస్టులదేనని, తెలంగాణ యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అన్నారు. గురువారం గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో సిపిఐ శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి హాజరై మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించినా కూడా తెలంగాణ ప్రాంతం నైజాం రాజు ఆధీనంలో ఉండి నియంత, నిరంకుశ పాలన వల్ల భూస్వాములు, పటేల్, పట్వారీలు గ్రామాలలో తమ ఆగడాలు పెట్రేగి పోతున్న సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, వెట్టి చాకిరి, బానిసత్వంకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మక్దూం మొయినుద్దీన్ పిలుపునిచ్చారని తెలిపారు. ఆ పిలుపునందుకుని 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిందని, 3000 గ్రామాలను విముక్తి చేసిందని, 4500 మంది కమ్యూనిస్టులు తమ రక్తాన్ని చిందించి ప్రపంచ చరిత్రను సృష్టించారని తెలిపారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితమే 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమయిందని కొనియాడారు. నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర ముమ్మాటికి కమ్యూనిస్టులదే అన్నారు. తెలంగాణ యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 11 నుండి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు, దానిలో భాగంగా సెప్టెంబర్ 11న హనుమకొండ జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయం నుండి ఏకశిల పార్క్ టాను నాయక్ విగ్రహం వరకు వందలాది మందితో ర్యాలీ నిర్వహించి సభ నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతున్నారని తెలిపారు. సెప్టెంబర్ 11న జరిగే ప్రారంభ కార్యక్రమాన్ని, సెప్టెంబర్ 11 నుండి 17 వరకు జిల్లా వ్యాప్తంగా జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రద చేయాలని వారు ప్రజలను కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పూజారి అమృతయ్య, మామునూరి దామోదర్, కేతపాక ప్రసాద్, గుంటి రజిత, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# శక్తి సదన్ - స్వాధార్ గృహను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం నగరంలోని శక్తి సదన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంలో భాగంగా కలెక్టర్ శక్తి సదన్‌లోని వసతులను పరిశీలించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న ఇన్‌మేట్స్‌తో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శక్తి సదన్ లో నిర్వహిస్తున్న అడ్మిషన్స్ రిజిస్టర్,స్టాఫ్ రిజిస్టర్, ఇన్‌మేట్స్ అటెండెన్స్ రిజిస్టర్, ఇతర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. గృహంలో అందిస్తున్న కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్ శిక్షణ వంటి వృత్తి విద్యా కోర్సుల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతే కాకుండా ఇన్‌మేట్స్ కు అందిస్తున్న భోజన మెనూ గురించి, తాగునీరు ఎక్కడి నుండి అందిస్తున్నారు, నాణ్యత ఎలా ఉంది అనే విషయాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇన్‌మేట్స్ తో ఇంటరాక్ట్ అయ్యి...అందరూ తమ చదువులను పూర్తి చేసుకోవాలని, చదువు పూర్తయిన తర్వాత వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించి, వారు స్వయం సమృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎమ్. విశ్వజా, ఈ.వో. ఆశాదేవి,శక్తి సదన్ సూపరింటెండెంట్ శైలజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మది చెరగని ముద్ర

- వెట్టి చాకిరి, విముక్తి కోసం పోరాడిన యోధురాలు
- రజక వృత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ 41వ వర్ధంతి
- ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్



**తొర్రూరు , సెప్టెంబర్ 10 (జనం సాక్షి):**వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని గురువారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలోని ఆర్‌డబి గెస్ట్ హౌస్ లో రజక వృత్తి దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పున్నం సారయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపాలిటీ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చెరగని ముద్ర వేసిన గొప్ప మహిళా యోధురాలని అన్నారు. సామాజిక అన్యాయం, జమీందారీ వ్యవస్థ, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడి అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు.ఉద్యమ నాయకురాలు వీరనారి చాకలి ఐలమ్మ పాలకుర్తి గడ్డ పై జన్మించడం గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో తొర్రూర్ రజక సంఘం మండలాధ్యక్షు నిమ్మల.సోమయ్య, కార్యదర్శి పొడగంటి శేఖర్ ,పట్టణ అధ్యక్షుడు చింతల. రాజు, కార్యదర్శి చింతల .మధు, నాయకురాలు ఓరుగంటి చైతన్య,నాయకులు ఓరుగంటి . ప్రవీణ్,మడిపెద్ది కార్తిక్,కొండ్రతి రామక్రిష్ణ,సైదులు,రాకున్నా, శ్రీకాంత్, శ్రీనివాస్,బిక్షం , రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని

# ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రంగు మురళి



**పెద్దవంగర సెప్టెంబర్ 10(జనం సాక్షి )**చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రంగు మురళి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎక్స్ రోడ్డు వద్ద వీరనారి చాకలి ఐలమ్మ 41 వర్ధంతి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగు మురళి మాట్లాడుతూ, తెలంగాణలో చాకలి ఐలమ్మ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, ఆమె చూపిన ధైర్య సాహసాలను మరియు స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముద్దసాని సురేష్, సంకెపల్లి రవీందర్ రెడ్డి, సురేష్ బాబు, అనపురం శ్రీనివాస్,ఎదునూరి సిరి శ్రీనివాస్, బోనగిరి లింగమూర్తి,మోహన్ రావు, రాములు, సుభాష్, జాటోత్ వెంకన్న, ఎల్లప్ప కళ్యాణ్, యాకయ్య, కొమురయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ దరఖాస్తుల జాబితా ప్రదర్శన



**కాళేశ్వరం , సెప్టెంబరు 10 , ( జనం సాక్షి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ఒకటవ అంగన్వాడీ కేంద్రం మరియు ఇప్పలబోరు అంగన్వాడీ కేంద్రంలలో టీచర్ పోస్టులకు వచ్చిన దరఖాస్తుల జాబితాను గ్రామపంచాయతీ నోటీస్ బోర్డ్ పై ప్రదర్శించడం జరిగింది.అలాగే, అభ్యర్థుల అసలు ధ్రువపత్రాల పరిశీలన తేదీలను సంబంధిత అభ్యర్థులకు తదుపరి తెలియజేయడం జరుగుతుంది అని ఐసిడిఎస్ అంగన్వాడీ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధీర్, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీధర్ , ఐసిడిఎస్ అధికారులు , అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు




పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర జిల్లా స్థాయిలో జయంతి ఉత్సవ సంబరాలు నిర్వహించింది. ఇందులో భాగంగా గురువారం ఉదయం 10.30 గం సంక్షేమ భవనము ములుగు జిల్లాలో వర్ధంతి వేడుకలు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధ్వర్యంలో నిర్వహించినారు. ఇందులో బాగంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి రామ్మోహన్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మగా గుర్తింపు పొందిన తెలంగాణ ఉద్యమకారిణి వీరవనిత, తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి అనికొనియాడరు.. ఈ కార్యక్రమంలో నేరెళ్ళ శంకర్, పరికిరాల రవి, ఎన్నిలా మహేందర్, వడ్డేపల్లి సారంగపాణి, జలిగం శ్రీనివాసు, తదితర చాకలి సంఘ నాయకులు, బీసీ కుల సంఘాల నాయకులు, అలాగే సంక్షేమ భవన కార్యాలయ సిబ్బంది, బీసీ వెల్ఫేర్ శాఖ ఉద్యోగులు మొగిళి, సరిత, మానస, రేణుక, సాదాలు, ప్రతపు రత్నాకర్, కుమారస్వామి, జి. గోపాల్ చారి, నాలుగవ తరగతి ఉద్యోగులు మరియు విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ల దరఖాస్తుదారుల జాబితా విడుదల

**డీడబ్ల్యూఓ మల్లేశ్వరి**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** అంగన్‌వాడీ టీచర్ల పోస్టుల దరఖాస్తుదారుల జాబితా విడుదల చేసినట్లు జిల్లా సంక్షేమాధికారి జి. మల్లేశ్వరి తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భూపాలపల్లి, మహాదేవ్‌పూర్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితాను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సంబంధిత గ్రామ పంచాయతీలలో ప్రదర్శించడం జరిగిందన్నారు. అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనను ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించినట్లు వెల్లడించారు. జాబితాలో ఉన్న అభ్యర్థులు పై తేదీలలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలన్నారు. వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సిన తేదీ, సమయం తదితర వివరాలను సంబంధిత సీడీపీఓ కార్యాలయాల ద్వారా వ్యక్తిగతంగా తెలియజేస్తామని, అభ్యర్థులు నిర్ణీత సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై నియామక ప్రక్రియను సజావుగా పూర్తి చేసుకోవాలని సూచించారు.

## అదనపు పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని ఆర్డీవోకు వినతి



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 10 ( జనం సాక్షి):** మండలంలోని బోడ మాణిక్యం తండా గ్రామంలో అదనపు పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని నర్సంపేట ఆర్డీవో ఉమారాణిని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు భూక్య మహబూబ్ సింగ్ రాథోడ్, మండల కాంగ్రెస్ కార్యదర్శి భూక్య మోహన్ నాయక్, మంచోజు వెంకటేశ్వర్లులు కోరారు. గురువారం ఈ మేరకు ఆర్డీఓ ఉమారాణికి వినతి పత్రాన్ని అందించారు. చెన్నారావుపేట మండల పరిధిలో కొత్తగా ఏర్పాటు అయిన తండా గ్రామపంచాయతీలలో ప్రత్యేక ఎన్నికల పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేయాలని కోరారు. ఉమ్మడి గ్రామాలలో ఉన్న పోలింగ్ బూత్ లకు వెళ్లి ఓటు వేయాలంటే తండాలలోని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీవో సానుకూలంగా స్పందించి వచ్చే ఎన్నికల వరకు అదనపు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసే విధంగా సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## జోనల్ స్థాయి క్రీడోత్సవాలను ప్రారంభించిన ఎస్పి డా.శబరిష్



**గూడూరు,సెప్టెంబర్10(జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల బేతంచెర్ల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించే గూడూరు జోనల్ స్థాయిలో జరిగే కరాటే మరియు క్రీడో త్సవాలను ప్రారంభించేందుకు గురువారం ముఖ్యఅతిథిగా మానుకోట జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ హాజరై క్రీడలను ప్రారంభించారు.ఈసందర్భంగా ఎస్పి మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుండే విద్యతో పాటు క్రీడాలకు ప్రాముఖ్యతను ఇ వ్వాలని, విద్యార్థులకు క్రీడలు మానసికొల్లాసానికి దోహద పడతాయని విద్యార్థులకు తెలిపారు. ఈకార్యక్రమంలో డిఎస్పి తిరుపతి రావు, సీఐ వర్మ వినయ్ కుమార్,ఎస్ఐ రమేష్ బాబు,కరాటే మాస్టర్లు పెనక ప్రభాకర్, సిద్దబోయిన సంజీవ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముయ్యబోయిన వెంకన్న,రేగ పాపారావు,పీడీలు సుంచ కొమ్మాలు,ఇరుప దేవేందర్, తూర్పు వెంకటేశ్వర్లు,మేడ ప్రవీణ్,ఇరుప లక్ష్మి,రేగ రమేష్, గుమ్మడి వెంకటేశ్వర్లు, బిక్షపతి,మేడ ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమం అందరిది గౌరవం అనేది బాధ్యత

- తెలంగాణ పేరుతో స్వార్థ రాజకీయాలకు స్వస్తి పలకాలి
- ఉద్యమకారుల గుర్తింపు ప్రయోజనం కాదు, నైతిక బాధ్యత



**ములుగు జిల్లా** సెప్టెంబర్ 10(జనంసాక్షి).: తెలంగాణ ఉద్యమం ఒక వ్యక్తి వల్ల పుట్టలేదు. ఒక సంఘం వల్ల, ఒక పార్టీ వల్ల మాత్రమే సాధ్యం కాలేదు. దశాబ్దాల తరబడి సాగిన ప్రజా ఆకాంక్ష, అనేక తరాల పోరాటం, వేలాది కుటుంబాల త్యాగాలు, కోట్లాది తెలంగాణ ప్రజల భాగస్వామ్యంతోనే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. ఈ నేపథ్యంలో నేడు ఉద్యమకారుల గుర్తింపు అంశంపై జరుగుతున్న చర్చ ఆత్మపరిశీలనకు దారితీయాల్సిన అవసరం ఉంది.

**1969 నుంచి 2014 వరకు… ఎవరిదీ పోరాటం?**

1969 తొలిదశ ఉద్యమం నుంచి 2014 మలిదశ ఉద్యమం వరకు తెలంగాణ కోసం సమాజంలోని ప్రతి వర్గం పోరాడింది. విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు, మహిళలు, న్యాయవాదులు, మేధావులు, కళాకారులు, జర్నలిస్టులు, రాజకీయ నాయకులు… ఇలా చెప్పుకుంటూ పోతే అనేక మంది ఏదో ఒక దశలో తెలంగాణ జెండా మోశారు. ఒకరు రోడ్డుపైకి వచ్చారు, మరొకరు ఉద్యోగాన్ని త్యాగం చేశారు, ఇంకొకరు ఆర్థికంగా అండగా నిలిచారు, మరొక కుటుంబం తన బిడ్డను కోల్పోయింది. ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించిన ప్రతి తెలంగాణ బిడ్డ ఉద్యమ చరిత్రలో ఒక భాగమే. దీన్ని ఒక వ్యక్తికి, ఒక కుటుంబానికి, ఒక సంఘానికి పరిమితం చేయడం చరిత్రను కుదించడమే అవుతుంది. అదే సమయంలో కీలక నాయకత్వ పాత్ర పోషించిన వారిని తక్కువ చేయడం కూడా సరికాదు. చరిత్రలో అందరికీ స్థానం ఉండాలి, కానీ ఎవరికీ ఏకాధిపత్య హక్కు లేదు.

**కుటుంబమే ఉద్యమం చేస్తే… వ్యక్తి పాత్ర ఏమిటి?**

ఉద్యమంలో తల్లి, తండ్రి, అన్న, తమ్ముడు కలిసి పాల్గొన్న కుటుంబాలు అనేకం ఉన్నాయి. వారిని ఉద్యమకారులు కాదని ఎవరూ అనలేరు. కానీ కేవలం కుటుంబ సభ్యుడు పాల్గొన్నాడనే కారణంతో ఆ కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ జీవితాంతం ప్రత్యేక హక్కులు కల్పించాలనే వాదన సహేతుకం కాదు. ఉద్యమ గౌరవం వారసత్వ ఆస్తి కాదు, అది ప్రజా చరిత్రలో సంపాదించుకున్న నైతిక గౌరవం.

**సంఘాల పేరుతో విభజన… లక్ష్యం ఏమిటి?**

నేడు ఉద్యమకారుల పేరుతో అనేక సంఘాలు పుట్టుకొస్తున్నాయి. సంఘాలు ఏర్పడటం తప్పు కాదు. కానీ ఆ సంఘాల లక్ష్యం ఏమిటి? అమరుల కుటుంబాలను పరామర్శిస్తున్నారా? నష్టపోయిన కుటుంబాలకు అండగా నిలుస్తున్నారా? లేక ప్రభుత్వం నుంచి ప్రయోజనం పొందడానికి ఉద్యమకారుల పేరును ఒత్తిడి సాధనంగా వాడుతున్నారా? ప్రతి సంఘం ఆత్మపరిశీలన చేసుకోవాలి.ఇల్లు, భూమి, పెన్షన్ వంటి ప్రయోజనాలు ఇవ్వాలంటే స్పష్టమైన ప్రమాణాలు, ధృవీకరణ వ్యవస్థ, ఆర్థిక సాధ్యత ఉండాలి. లేకపోతే ఉద్యమకారుల పేరుతోనే కొత్త వివాదాలు, విభజనలు పుడతాయి.

**"నాకేం వస్తుంది?" కాదు… "నా తెలంగాణకు ఏమవుతోంది?"**

నిజమైన ఉద్యమకారుడి గుర్తింపు ప్రయోజనం కాదు, బాధ్యత. తెలంగాణ ఎందుకు కావాలనుకున్నాం? రాష్ట్రం ఏర్పడ్డాక రైతు, యువత, విద్య, వైద్యం, దళిత, గిరిజన, బడుగు వర్గాల పరిస్థితి ఏమిటి? తెలంగాణ వనరులు ప్రజలకు అందుతున్నాయా? అని ప్రశ్నించే బాధ్యత కూడా ఉద్యమకారుడిదే. ఉద్యమకారుడి గౌరవం గుర్తింపు కార్డు కాదు, అది సామాజిక బాధ్యత.

"నాకేం వస్తుంది?" అనే ప్రశ్న మాత్రమే మిగిలి, "నా తెలంగాణకు ఏమి జరుగుతోంది?" అనే ప్రశ్న మరిచిపోతే ఉద్యమ స్ఫూర్తి దెబ్బతింటుంది. ప్రభుత్వాలు మారవచ్చు, కానీ తెలంగాణ ప్రయోజనం శాశ్వతం. ప్రతి ఒక్కరూ తమ ప్రాంతానికి హీరోయే. కానీ మొత్తం ఉద్యమం ఎవరి సొత్తు కాదు. కాబట్టి ఉద్యమకారులారా ఒక్కసారి ఆలోచించండి… నేను ఉద్యమకారుల కోసం పనిచేస్తున్నానా? లేక ఉద్యమకారుల పేరుతో నా స్వార్థం కోసం పనిచేస్తున్నానా? ఇకపై "నాకేం వస్తుంది?" కంటే "నా తెలంగాణకు ఏమి జరుగుతోంది?" అనే ప్రశ్నను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన ఉద్యమకారుడి లక్షణం.

# అనుమతి లేకుండా గణేష్ మండపాలు ఏర్పాటు చేయవద్దు

- నిబంధనలు ఉల్లంఘిస్తే ఇబ్బందులు తప్పవు.
- ములుగు డి ఎస్పీ ఎన్ రవీందర్.



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 10(జనంసాక్షి).** గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు మొదలవుతున్న వేళ ములుగు పోలీసులు డీఎస్పీ ములుగు ఆధ్వర్యంలో నిర్వాహకులకు కీలక సూచనలు చేశారు. అనుమతి లేకుండా గణేష్ మండపాలు ఏర్పాటు చేయవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఇబ్బందులు తప్పవని ములుగు డీఎస్పీ ఎన్ రవీందర్ స్పష్టం చేశారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించడంతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు గణేష్ మండపాల ఏర్పాటుపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మండపం ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు ముందుగానే ములుగు పోలీస్ స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని సూచించారు. అనుమతి పొందిన మండపాల వివరాలను పోలీసులు నమోదు చేసుకుని, భద్రతా చర్యలను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. పగలు, రాత్రి పోలీసుల నిఘా గణేష్ మండపాల వద్ద భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పగలు, రాత్రి బీట్ నిర్వహించడంతో పాటు నిరంతరం పెట్రోలింగ్ చేపడతామని డీఎస్పీ తెలిపారు. యువత అత్యుత్సాహానికి పోకుండా బాధ్యతగా వ్యవహరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీఐ దారం సురేష్, ఎస్సై ఎస్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# తీజ్ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



**చిట్యాల, సెప్టెంబర్ 10(జనం సాక్షి ):** చిట్యాల మండలంలోని ఒంటిపుత్తండా, అందుకుతండాలో గిరిజనులు నిర్వహిస్తున్న తీజ్ ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొని గిరిజనులతో కలిసి ఉత్సవాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీజ్ పండుగ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. గిరిజనుల సాంప్రదాయ పండుగలు, ఆచారాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని, వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.తీజ్ వేడుకల్లో మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ పాటలు పాడుతూ, నృత్యాలతో సందడి చేశారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, మాజీ ఎంపీటీసీ కుర మైపాల్‌రెడ్డి, గిరిజన పెద్దలు, కులస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పొలాల అమావాస్య





**బెల్లంపల్లి, సెప్టెంబర్ 10, (జనంసాక్షి)** బెల్లంపల్లి నియోజకవర్గంలో గురువారం పొలాల అమావాస్య పండగను రైతులు ఘనంగా జరుపుకున్నారు. శ్రావణమాసం చివరి రోజు కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వ్యవసాయంలో తమకు చేదోడు వాదోడు గా ఉన్న పశువులను పూజించే పండగ పొలాల అమావాస్య. రైతులు ఉదయాన్నే తమ పశువులకు శుభ్రంగా స్నానం చేయించి పూజలు చేస్తారు. పశువులను అందంగా ముస్తాబు చేసి ఊరేగిస్తారు. నేతకాని సామాజిక వర్గానికి పొలాల అమావాస్య అతి ముఖ్యమైన పండగ. నేతకాని కుటుంబాల్లో పొలాల అమావాస్యను పెద్దల అమావాస్యగ సంభోదిస్తారు. మరణించిన తల్లిదండ్రులు, తాతలు, పెద్దలను స్మరించుకుంటారు. ఇంట్లో, ఆవరణలో దీపం వెలిగించి పితృదేవతలకు నమస్కరిస్తారు. అన్నం, పప్పు, కూర, పాయసం వంటి వంటకాలు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. కొన్ని కుటుంబాలు తమ పొలాలకు వెళ్లి భూమాతకు పూజ చేసి మంచి పంటలు రావాలని ప్రార్థిస్తారు. పేదలకు అన్నదానం, వస్త్రదానం చేస్తారు. కుటుంబ సభ్యులు కలిసి పెద్దల గురించి జ్ఞాపకాలు నెమరువేసుకుంటారు. ఎడ్ల ప్రతిమలు, మట్టి గురుగులు చేసి జంజేరు పూలతో ప్రత్యేక పూజలు చేస్తారు. పొలాల అమావాస్య అయిన మూడు రోజుల తర్వాత బాజా భజంత్రిలతో ఊరేగింపుగా వెళ్లి స్థానిక చెరువుల్లో గురుగులను నిమజ్జనం చేయడంతో పండగ ముగుస్తుంది. కాగా పొలాల అమావాస్య మరుసటి రోజు బడగ పండగ చేస్తారు. శ్రావణమాసం సందర్భంగా నెల రోజుల పాటు మద్య మాంసాలకు దూరంగా ఉన్న పల్లె ప్రజానీకం బడగ పండగ పేరుతో పిండి వంటలు చేసుకుంటారు. మాంసం వండి సకుటుంబ సమేతంగా కలిసి భోజనం చేస్తారు. మద్యం, మాంసాహార వంటకాలతో బడగ పండగ హుషారెత్తిస్తుంది.

# హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**లక్సెట్టిపేట సెప్టెంబర్ 10, 2026: (జనం సాక్షి)** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ - 2026లో మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని లక్సెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి మండల తహసిల్దార్ దిలీప్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్ లతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో నోటీసుల జారీ, విచారణ ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియ నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సమన్వయంతో ఓటర్లకు అవగాహన కల్పించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిట్టపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజన నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. విద్యారంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ఈ క్రమంలో పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించాలని, మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని తెలిపారు. ఆసరా పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి మండల పరిషత్ అభివృద్ధి అధికారి లాగిన్ నుండి ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఆహారం నాణ్యతను పరిశీలించారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందిస్తూ నాణ్యమైన విద్యాబోధన అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### జూనియర్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు

# రెచిని పీఎం శ్రీ పాఠశాల విద్యార్థి శివప్రసాద్ ఎంపిక




**తాండూర్, సెప్టెంబర్ 10(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా : తాండూర్ మండలంలోని రేచిని పీఎం శ్రీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కురిమిల్ల శివప్రసాద్ (తండ్రి: సత్యనారాయణ) జూనియర్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ఈ నెల 11 నుండి 13వ తేదీ వరకు బెల్లంపల్లిలోని తిలక్ స్టేడియంలో అత్యంత వైభవంగా జరగనున్నాయి. ప్రముఖుల అభినందనలు:రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పాఠశాలకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచిన విద్యార్థి శివప్రసాద్‌ను అభినందిస్తూ స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది సంయుక్త ప్రకటన విడుదల చేశారు. శివప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శివప్రసాద్ రాబోయే రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో తన అత్యుత్తమ ప్రతిభను చాటి, పాఠశాలకు మరియు రేచిని గ్రామానికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ విద్యార్థికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలోరాంబాయి (గ్రామ సర్పంచ్)మాసాడే ప్రదీప్ (పాఠశాల ప్రధానోపాధ్యాయులు)నాగమణి (ఏపీసీ చైర్మన్)నిట్టూరి సంతోష్ కుమార్ (ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్)పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# యువకులకు వాలీబాల్‌లు అందజేత



**కాసిపేట సెప్టెంబర్10 ( జనం సాక్షి )** కాసిపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కసుకుల రాకేష్ మొదలు పెట్టిన నషా ముక్త్ కార్యక్రమంలో భాగంగా గురువారం దేవాపూర్, మద్దిమాడ గ్రామంలోని యువకులకు వాలీ బాల్‌లు అందించారు , ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ యువకులు గంజాయి డ్రగ్స్‌కి అలవాటు పడకుండా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడల మీద చదువుపై ఆసక్తి చూపించాలని అన్నారు. అలాగే యువకులు ఇతరులకు కూడా క్రీడల మీద ఆసక్తి వచ్చేలా క్రీడా నైపుణ్యం పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి కో ఆర్డినేటర్ ( జెబిఎం ) ప్రవీణ్ బాబు, శ్రీనివాస్, సతీష్, కేశవ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

### జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10(జనంసాక్షి ):** అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం మరియు బలహీన వర్గాల శ్రేయస్సు కోసం పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని, ఆమె పోరాటం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ డేవిడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ అనిల్ మర్మాట్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ లతతో కలిసి అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ పాల్గొన్నారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ అణగారిన వర్గాల ప్రజల భూమి, భూమి హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం మరియు ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటాలు చిరస్మరణీయమని, వారి పోరాటపటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి సంక్షేమ శాఖ అధికారి నదీం మాజిద్, బి సి సంఘం నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాసిపేట మండలంలో అదనపు కలెక్టర్ పర్యటన



**కాసిపేట సెప్టెంబర్ 10 ( జనం సాక్షి )** కాసిపేట మండలంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి చంద్రయ్య గురువారం ఆకస్మికంగా పర్యటించారు. ముత్యంపల్లి గ్రామపంచాయతీలోని స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎంక్వయిరీ ప్రక్రియను పరిశీలించి, ముత్యం పల్లిలోని విబిజి రామ్ జి కింద ఏర్పాటు చేయబడుతున్న ఫారం పొండు పనులను పరిశీలించారు. వెంకటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొలంగూడలో ఐటిడిఏ ద్వారా నిర్మించిన ఐకెపి,హెల్త్ మరియు గ్రామ పంచాయతీకి సంబంధించిన ఇతర రకాల సేవలు అన్ని ఒకే దగ్గర అందేలా ఏర్పాటు చేయబడినటువంటి కమ్యూనిటీ భవనాన్ని పరిశీలించారు. దానిని త్వరలో ఓపెన్ చేయుటకు సిద్ధంగా ఉండాలని తెలిపారు.దేవాపూర్ గ్రామపంచాయతీలో చేయూత పెన్షన్ల యొక్క యాప్ ఎంక్వైరీ ప్రక్రియను . గ్రామపంచాయతీలో నిరంతరం జరుగుతున్నటువంటి పారిశుద్ధ్య ప్రక్రియను ఎప్పుడు నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్యం పనులు నిర్వహించాలని వర్షాకాలంలో సిజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, మండల పంచాయతీ అధికారి షేక్ సప్దర్ అలీ,మరియు ఆయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తోట రంజిత్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భూపాలపల్లి జిల్లాకు చెందిన తోట రంజిత్ నియమితులయ్యారు. తన నియామకానికి సహకారం, ప్రోత్సాహం అందించి తనపై నమ్మకం ఉంచిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావుకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బట్టు కర్ణాకర్‌కు, ఎన్ ఎస్ యూ ఐ జాతీయ సమన్వయకర్త మార్క అభినయ్ గౌడ్‌కు, రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామికి రంజిత్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతను విద్యార్థులకు – ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ, విద్యార్థుల హక్కులు, సంక్షేమం, భవిష్యత్తు కోసం నిబద్ధతతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు..

## వర్షాల కోసం గ్రామ దేవతలకు బిందాలతో నీళ్లు వానలు లేక ఎందుతున్న పంటలు



**గంగారం సెప్టెంబర్ 10 (జనం సాక్షి)** గంగారం మండల కేంద్రంలో గంగారం రైతులు వానలు కురవాలని గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఎల్నినో ప్రభావం తో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి వేసుకున్న పంటలు ఎండిపోతున్నాయి. ఏజెన్సీ మండలమైన గంగారంలో ఈ ఏడాది మొదట్లో కొంత వరకు వర్షాలు కురవడంతో రైతులు ఆశాభావంతో పంట పైర్లు వేసుకున్నారు. అడపా దడపా వర్షాలకు పంటలు ఏపుగా పెరిగి రైతుల్లో ఆశలు పెరిగాయి. గత వారం రోజులుగా ఒక్క చినుకు కూడా పడక పోవడంతో ఏపుగా పెరిగిన మొక్కజొన్న, వరి, పత్తి, కంది లాంటి పంటలు ఎండిపోతున్నాయి. రైతుల ఆశలు అడియాశలౌతున్నాయి. దిగులుతో రైతులు తాము నమ్మిన దేవుళ్ళను కొలుస్తూ పూజలు చేస్తున్నారు.గంగారం మండల కేంద్రంలో గంగారం రైతులు స్థానికంగా ఉన్న గ్రామ దేవతలైనా బొడ్రాయి, ముత్యాలమ్మ, ఆంజనేయ స్వామిలతో పాటు గంగమ్మ ఆలయంలో గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు.

### ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి: డీఆర్‌డీఓ నాగపద్మజ



**నల్లబెల్లి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** గ్రామాల్లో ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టి ఎక్కువ మంది కూలీలకు పని కల్పించాలని డీఆర్‌డీఓ కె. నాగపద్మజ సూచించారు. నల్లబెల్లి మండలంలో టీఏఎస్ క్లస్టర్ వారీగా, గ్రామాల వారీగా కూలీల హాజరుపై ఆమె సమీక్ష నిర్వహించారు. తక్కువ మంది కూలీలు పనిచేస్తున్న గ్రామాల్లో లేబర్ రిపోర్టును మెరుగుపరచాలని ఎఫ్ఏలను ఆదేశించారు. ప్రతి గ్రామంలో కనీసం 30--40 మంది కూలీలతో పనులు చేపట్టాలని సూచించారు. ఫామ్ పాండ్స్, ప్లాంటేషన్, ఇందిరమ్మ ఇళ్లు, ఇంకుడు గుంతలు, ఆయిల్‌పామ్, యూకలిప్టస్, జలశ్రీ తదితర పనులను వెంటనే ప్రారంభించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి. రమణ రెడ్డి, ఏపీవో వెంకట్ నారాయణ, ఈసీ పి. రాజు, ఏఈఓ బి. రాజు, టీఏ సాయికృష్ణ, నరేష్, నాగరాజు, తిరుమలదేవి, ప్రశాంత్ పాల్గొన్నారు.

## రోడ్ ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



**బయ్యారం సెప్టెంబర్ 10( జనంసాక్షి)** బైక్ అదుపుతప్పి కింద పడి పోవడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయిన సంఘటన గురువారం మండలంలోని నామాలపాడు వద్ద చోటు చేసుకుంది.వివరాలు ఇలావున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణానికి చెందిన సంపత్ కుమార్ అనే యువకుడు ఇల్లందు నుండి బయ్యారం వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా నామాల పాడు సమీపంలో అదుపు తప్పి పడిపోయాడు. ఇది గమనించిన స్థానికులు 108 కు సమాచారం ఇవ్వడం తో సిబ్బంది పైలట్ జక్కుల వీరన్న, ఈఎంటీ లకావత్ నరేష్, ప్రమాద స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ



**నల్లబెల్లి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని తెలంగాణ రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు నూతనకంటి ఆనందం అన్నారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో నల్లబెల్లి గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆమె విగ్రహాన్ని ఆవిష్కరించారు. రజక సంఘం గ్రామ అధ్యక్షుడు రాపాల లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి నూతనకంటి ఆనందం ముఖ్యఅతిథిగా హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలతో పోరాడి అణగారిన వర్గాలకు స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. విగ్రహ ఏర్పాటుకు సహకరించిన దాతలు మహిపాల్‌రెడ్డి, గణేష్‌రెడ్డిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో దళపతి, గోపాల్, వినయ్‌కుమార్, తహసీల్దార్ ముప్పు కృష్ణ, సర్పంచులు నాగెల్లి జ్యోతి ప్రకాష్, పొదిళ్ల వసంత శోభన్, ఉపసర్పంచ్ గుమ్మడి వేణు, రజక సంఘ నాయకులు, ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా కేంద్రీయ విద్యాలయ ప్రవేశాల లక్కీడ్రా

- సిఫార్సులకు తావులేకుండా నిబంధనల ప్రకారమే ప్రవేశాలు
- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి



**ములుగు ప్రతినిధి,సెప్టెంబర్ 10(జనంసాక్షి).** కేంద్రీయ విద్యాలయ ప్రవేశాలకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి తెలిపారు. గురువారం ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయ తరగతుల్లో ప్రవేశాల కోసం లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్రీయ విద్యాలయ ప్రవేశాల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, ఎలాంటి సిఫార్సులు, పైరవీలకు తావులేకుండా కేంద్రీయ విద్యాలయ నిబంధనలను అనుసరించి నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిశీలన, అర్హతల నిర్ధారణతోపాటు అందుబాటులో ఉన్న సీట్లను లక్కీ డ్రా ద్వారా భర్తీ చేసి, ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎ సిద్ధార్థ రెడ్డి, కేంద్రీయ విద్యాలయ ప్రధానాచార్యులు సీతారాం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా సహకార సంఘం: చైర్మన్ బండారి మల్లయ్య



**బయ్యారం సెప్టెంబర్ 10( జనం సాక్షి)** రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పని చేస్తుందని చైర్మన్ బండారి మల్లయ్య అన్నారు.బయ్యారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యులుగా కొనసాగుతూ మండలంలోని లక్ష్మీనరసింహపురం గ్రామవాసి మడిపెద్ది రామచంద్రు అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడికి ఖమ్మం డిసిసిబి సౌజన్యంతో సంరక్షణ సంక్షేమ నిధి నుంచి మంజూరైన ఇన్సూరెన్స్ సొమ్ము 1 లక్ష రూపాయల చెక్‌ను గురువారం స్థానిక కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వారి కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలవడమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యమని అన్నారు. సంఘంలో సభ్యత్వం పొందిన రైతులు, వారి కుటుంబాలకు కష్టకాలంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు సంరక్షణ సంక్షేమ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కసనబోయిన శ్రీనివాస్, గాదుదుల కేతమల్లు,అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమేష్, కార్యదర్శి రేగళ్ల సురేందర్,సిబ్బంది గంట్ల అనూష, తుడుం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ జీవితం అన్యాయాన్ని ప్రశ్నించే స్ఫూర్తి




**బయ్యారం సెప్టెంబర్ 10(జనంసాక్షి)** సాయుధతెలంగాణ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ జీవితం నాటి చరిత్రే కాదు నేటి తరానికి అన్యాయాన్ని ప్రశ్నించే స్ఫూర్తి అని సిపిఎం జిల్లా నాయకులు మంద రాజన్న, మండల కార్యదర్శి సంబారి మధు అన్నారు. గురువారం స్థానిక వెజెళ్ళ సైదుల్ రావ్ భవనంలో చిట్యాల ఐలమ్మ 41 వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం వారు మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం ,వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భారత దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన మహత్తర పోరాటమని అన్నారు.ఆ పోరాటంలో మట్టిలో మాణిక్యంలా వెలుగొందిన వీరనారి చిట్యాల ఐలమ్మని తెలిపారు. వృత్తిదారుల కుటుంబంలో జన్మించిన ఆమె వెట్టి చాకిరి చేయించే దొరలని ఎదిరించి అణగారిన వర్గాలలో చైతన్యం నింపిన అగ్నికణం ఐలమ్మ అని అన్నారు. ఆమె స్ఫూర్తిని పుణికి పుచ్చుకుని మహిళలు మహిళాసాధికారత కోసం పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంగిరేకుల నాగేశ్వరావు, వల్లాల వెంకన్న, మోహన్, రాము, అప్పయ్య, రమేష్, రవి, సత్తిరెడ్డి, కొల్లా పూర్ణ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ చేసిన నాటి పోరాటం యువత ఆదర్శంగా తీసుకోవాలి

## మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్



**స్టేషన్ ఘన్‌పూర్,సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** ఐలమ్మ చేసిన నాటి పోరాటం యువత అధ్యయనం చేసి ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమా ర్ అన్నారు. ఈరోజు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యం లో కౌన్సిలర్ పొన్న రవి అధ్యక్షతన చాకలి ఐలమ్మ వర్ధంతి గురువారం ఘనంగా నిర్వ హించారు. పట్టణ కేంద్రంలోని ఐలమ్మ విగ్రహా నికి మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళు ల ర్పించారు. చైర్మన్ తో పాటు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, రజక సంఘం నాయకులు, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణలో దొరలు, భూస్వాముల పెత్తనానికి వ్యతిరేకంగా పేదలు, రైతులు, కూలీల హక్కుల కోసం ఐలమ్మ ధైర్యంగా పోరాడారని అన్నారు. తన కు ఎదురైన అణచివేతకు భయపడకుండా పోరాడి ప్రజల్లో స్ఫూర్తిని నింపారని గుర్తుచే శారు. ఐలమ్మ పోరాటం కేవలం ఒక వ్యక్తి భూమి కోసం చేసిన పోరాటంకాదని, పేదలు, రైతులు,కూలీల ఆత్మగౌరవం, భూమి, హక్కు ల కోసం సాగిన ప్రజా పోరాటానికి ప్రతీక అని అన్నారు. ఆమె చూపిన పోరాట మార్గం నేటి తరాలకు కూడా ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పొన్న రవి, పొన్న రాజేష్ గుర్రం హరినాథ్ ,బొల్లు లక్ష్మి, అంగడి అనిత,బూర్ల రాజేశ్వర్,తాటికొండ మధు, రజక సంఘము నాయకులు పొన్న సత్యనా రాయణ, పొన్న రమేష్ , రిటైర్డ్ ఉద్యోగి పొన్న రమేష్ , పొన్న మధు, పొన్న శ్రీకాంత్, పొన్న గౌతమ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజు , కొలిపాక సతీష్, మాజీ ఎంపీటీసీ గట్టు రమేష్ ,పెసరు సారయ్య, గట్టు రమేష్, మామిండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**నెన్నెల, సెప్టెంబర్ 10, (జనం సాక్షి):** నెన్నెల మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకుని రజక కులస్తులు ఘనంగా నివాళులర్పించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె చేసిన వీరోచిత పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక కుల పెద్దలు, మహిళలు, యువకులు, కులస్తులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే లక్ష్యం :ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

## నేరాల నియంత్రణలో రాజీలేని పోలీసింగ్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజల భద్రతే తమ లక్ష్యమని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతలు, నేర నియంత్రణ చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నేరాల నియంత్రణలో రాజీలేని విధంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి నాణ్యమైన దర్యాప్తుతో బాధితులకు న్యాయం అందించాలన్నారు. దొంగతనాల నియంత్రణకు గస్తీ, నిఘా పెంచాలని, సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాలను ఛేదించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, పోక్సో కేసుల్లో ప్రత్యేక శ్రద్ధతో దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్‌లో కేసుల నమోదు, దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి పోలీస్ సేవలను మరింత పారదర్శకంగా అందించాలన్నారు. ఈ నెల 12న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని, రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామస్థాయి పోలీసింగ్ ను బలోపేతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీ సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## కాసిపేట-1 ఇంక్లైన్‌లో

# ఉద్యోగులకు సీపీఆర్‌పై అవగాహన



**కాసిపేట సెప్టెంబర్ 10 ( జనం సాక్షి)** మందమర్రి ఏరియాలోని కాసిపేట-1వ గనిలో గురువారం సీపీఆర్ పై ఉద్యోగులకు అవగాహన కల్పించారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడే సీపీఆర్ విధానంపై రెస్క్యూ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన, ప్రాక్టికల్ డెమాన్‌స్ట్రేషన్ మరియు హ్యాండ్స్-ఆన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ సందర్భంగా రెస్క్యూ ఇన్‌చార్జి రామ్ మోహన్ ఆధ్వర్యంలోని రెస్క్యూ టీమ్ సీపీఆర్ ఎప్పుడు చేయాలి, బాధితుడి పరిస్థితిని ఎలా గుర్తించాలి, ఛెస్ట్ కంప్రెషన్స్ ఎలా చేయాలి, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను ప్రాక్టికల్‌గా వివరించారు. అనంతరం ఉద్యోగులు మరియు అధికారులతో స్వయంగా సీపీఆర్ చేయిస్తూ హ్యాండ్స్-ఆన్ శిక్షణ అందించారు. ఈ సందర్భంగా మేనేజర్ డి. సతీష్ మాట్లాడుతూ, గనుల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం అందేలోపు సకాలంలో సరైన సీపీఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఉద్యోగి ఇటువంటి ప్రాణరక్షక నైపుణ్యాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఈకార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, సేఫ్టీ ఆఫీసర్ సురేష్, ఇతర అధికారులు, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ వి. రాజేందర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

# మట్టి గణపతినే పూజిద్దాం-పర్యావరణాన్ని కాపాడుదాం

## సైన్స్ టీచర్ ప్రభాకర్ రెడ్డి




**మహాదేవపూర్: సెప్టెంబర్ 10 (జనంసాక్షి ):** మట్టి గణపతిని పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం, పర్యావరణ పరిరక్షణ మనందరి భాద్యత అనే నినాదంతో బాలుర పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులచేత మట్టి గణపతి విగ్రహాలు తయారు చేయించడంజరిగింది. ప్రజలంతా సోమవారం జరుపుకోబోయే వినాయక చవితి పండుగకు మట్టితో చేసిన గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎన్.జీ.సీ ఇంచార్జి ఉపాధ్యాయులు బి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఈమట్టి గణపతి విగ్రహాలు తయారి వర్క్ షాప్ ను మహాదేవపూర్ స్థానిక సర్పంచ్ హసీనా బాను ప్రారంభించి పర్యావరణం కాపాడడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని మట్టి విగ్రహాలు నేలలో త్వరగా కరిగిపోయి కాలుష్యం నుండి రక్షిస్తాయని అన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్ మాట్లాడుతూ. ప్రతీ సంవత్సరం మట్టి గణపతి విగ్రహాలు తయారు చేస్తూ కాలుష్యం తగ్గించడానికి కృషి చేస్తున్న బాలుర పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు.పీ ఓ పీ తో చేసిన విగ్రహాలకు వాడిన కెమికల్ రంగులు జలచరాలకు హాని కలిగించి జల కాలుష్యం ఏర్పడిన పర్యావరణ సమస్యలు వస్తాయని అనిల్ కుమార్ అన్నారు. అవగాహన లోపంతో మానవ కార్యకలాపాల వల్ల పర్యావరణం పాడై పోవడంతో ఎల్ నినో ప్రభావం మనం ప్రత్యక్షంగా అనుభవిస్తున్నామన్నారు. అదేవిధంగా 14 సోమవారం వినాయక చవితి పండుగ సందర్భంగా ఉదయం7 గంటలకు పాఠశాల ఆవరణలో మట్టి గణపతులను పంపిణీ చేయడం జరుగుతుందని ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సైన్స్ టీచర్ ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, రాజయ్య, దేవేందర్ రెడ్డి,రమేష్, లచ్చయ్య, అనిల్ సమ్మయ్య,షాజహా, అనిత, కవిత, కిరణ్ కుమార్, కోటేశ్వర్, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మృతి చెందిన మన్నాన్ దేశముఖ్

# కుటుంబాన్ని పరామర్శించిన అజ్మీరా శ్యామ్ నాయక్



**కెరమెరి, సెప్టెంబర్ 10(జనంసాక్షి)** కెరమెరి మండల కేంద్రానికి చెందిన షేక్ మన్నాన్ దేశముఖ్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ గురువారం నాడు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కెరమెరి మండల అధ్యక్షుడు సుజాయిత్ ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాజిద్ దేశముఖ్, సుదర్శన్ రాథోడ్, గిడ్డప్ప, షేక్ మహమ్మద్, దుర్గన్న, అయూబ్ ఖాన్, షేక్ రజాక్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### జోనల్ స్థాయికి ఏహెచ్ఎస్

## ఇర్సులాపురం విధ్యార్థుల ఎంపిక



**బయ్యారం సెప్టెంబర్ 10( జనంసాక్షి)** గత మూడు రోజులుగా మండల కేంద్రంలో జరిగిన ఎస్‌జిఎఫ్ఐ పోటీలలో ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పలువురు అత్యంత ప్రతిభ కనబరచి జోనల్ పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌జిఎఫ్ఐ బయ్యారం మండల స్థాయి పోటీలు 7,8,9 తేదీలలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరిగాయి. ఈ పోటీలలో ఇర్సులా పురం ఆశ్రమ పాఠశాల వాలీబాల్ జూనియర్, సీనియర్ విభాగాలలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈపాఠశాలనుండి , కోకో జూనియర్ విభాగంలో నలుగురు విద్యార్థులు, సీనియర్ విభాగంలో ముగ్గురు, కబడ్డీ సీనియర్లో ముగ్గురు విద్యార్థులు జోనల్‌కు ఎంపిక అయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులను,వ్యాయామ ఉపాధ్యాయున్ని అభినందించారు.

## మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం: ప్రిన్సిపాల్ రాజమణి




**బయ్యారం సెప్టెంబర్ 10( జనంసాక్షి)** పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజమణి అన్నారు.గురువారం కళాశాలలో విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసినటువంటి విగ్రహాల వలన పర్యావరణానికి అనేక నష్టాలు కలుగుతాయని క్యాన్సర్స్ వంటి భయానక వ్యాదులు వస్థాయని అన్నారు. విద్యావంతులుగా మీరు గ్రామప్రాంతాల్లో ప్రజలను మట్టి వినాయక విగ్రహాలను పూజించేలా చైతన్య పరచాలని సూచించారు. ఎన్ఎస్ఎస్‌పి.ఓ సంతోష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపక బృందాం సరిత, కుమారస్వామ, గిరి, స్నేహ,భాస్కర్, బాబూలాల్, సదాశివుడు, వెంకటలక్ష్మి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## టేకుమట్ల మండల కేంద్రంలో
## వీరనారి సాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి వేడుకలు



**టేకుమట్ల సెప్టెంబర్ 10 జనంసాక్షి** టేకుమట్ల మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి వేడుకలు టేకుమట్ల రజక సంఘం మండల అధ్యక్షులు చెలికాని శంకర్ నిమ్మల స్వామి జంగా పెల్లి సారయ్య సమ్మయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు అనంతరం . వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకారులపై వీరోచిత పోరాటం చేసి అసువులు బాసిన చాకలి ఐలమ్మ పోరాటాన్ని పూర్తిగా తీసుకొని తెలంగాణ ప్రభుత్వం సాకలి ఐలమ్మ విగ్రహం టేకుమట్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని వారు అన్నారు అదేవిధంగా రజక సంఘాలకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల సర్పంచ్ మాట్ల శ్రీనివాస్ బూర్నపల్లి సర్పంచ్ నేరెళ్ల రామకృష్ణ గౌడ్, వెలిశాల సర్పంచ్ బొడ్డు తిరుపతి,మాజీ ఎంపీటీసీ ఆది సునీత రఘు టేకుమట్ల ఉపసర్పంచ్ ఎలబోయిన రజిత నర్సయ్య సోమనపల్లి ఉపసర్పంచ్ అబ్బేంగుల రాజయ్య ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ జిల్లా నాయకులు రామ్ రామచందర్ మాదిగ,నాలుగవ వార్డు నెంబర్ మచ్చ భాగ్య సరోత్తం , నిమ్మల స్వామి, కంచెర్ల మహేష్,మాదారపు కుమారస్వామి ,మారం శ్రీను పాల్గొన్నారు.

# దళితుల ఆత్మగౌరవంపై కేసీఆర్ అహంకారం

### కేసీఆర్ వ్యవహారశైలిపై తీవ్రస్థాయిలో మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు

**మంగపేట, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవహారశైలిపై కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 7న ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ వద్ద దళితులు డప్పులతో శాంతియుతంగా నిరసన తెలిపిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం కేసీఆర్ ఫ్యూడల్ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రంలో దళితుల ఓట్లతో అధికారాన్ని అనుభవించి, అదే వర్గానికి చెందిన ప్రజలు తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తే, వారు నిలబడిన ప్రదేశాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం అత్యంత సిగ్గుచేటైన చర్య అని అన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 అంటరానితనాన్ని పూర్తిగా నిషేధిస్తుందని గుర్తుచేస్తూ, ముఖ్యమంత్రి పదవిని అనుభవించిన కేసీఆర్ రాజ్యాంగం కల్పించిన సమానత్వ స్ఫూర్తిని గౌరవించాలని హితవు పలికారు. దళితులను అవమానించే, కులవివక్షను ప్రోత్సహించే ఎలాంటి చర్యలనూ తెలంగాణ సమాజం సహించదని



హెచ్చరించారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే రాజకీయాలకు ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన సమాధానం చెబుతామని చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యులు మురుకుట్ల నరేందర్, జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాయం అనిత, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బాడిషా ఆదినారాయణ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లికొండ యాదగిరి, మాజీ సర్పంచ్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## తాండూర్ మేజర్ గ్రామపంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల భూమి పూజ

**తాండూర్, సెప్టెంబర్ 10(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా :తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామపంచాయతీ 1వ వార్డులో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు గురువారం రోజున భూమి పూజ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ సాంప్రదాయబద్ధంగా కొబ్బరికాయ కొట్టి, భూమి పూజ చేసి ఈ నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మరియు నాయకులు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి తోడ్పడే ఈ సీసీ రోడ్డు నిర్మాణం వల్ల స్థానిక ప్రజలకు ఎంతో కాలంగా ఉన్న రవాణా ఇబ్బందులు తొలగిపోతాయని, మెరుగైన సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను పూర్తి నాణ్యత ప్రమాణాలతో, నిర్దేశిత కాలపరిమితిలోగా వేగంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను, అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు: సింగరావ్ శంకర్ (తాండూర్



మాజీ ఎంపీపీ) ఎండి ఈసా (కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు)డాక్టర్ సత్యం (ఉప సర్పంచ్) విష్ణు కళ్యాణ్ గారు (యూత్ కాంగ్రెస్ తాండూరు మండల ప్రెసిడెంట్ పురమశెట్టి అరుణ్ (యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి)శ్రీధర్ (వైస్ ప్రెసిడెంట్)శ్రీకాంత్ (1వ వార్డు సభ్యులు పెర్కా కమల్, మహేందర్ (స్థానిక కాంగ్రెస్ నాయకులు) పాల్గొన్నారు.

## మండల వ్యాప్తంగా వైభవంగా పొలాల అమావాస్య వేడుకలు

**సిర్పూర్ టి, సెప్టెంబర్10,(జనంసాక్షి):** మండల వ్యాప్తంగా పొలాల అమావాస్య వేడుకలు గురువారం అత్యంత వైభవంగా, సంప్రదాయబద్ధంగా జరిగాయి. ఆరుగాలం శ్రమించి పంటలు పండించే అన్నదాతకు వ్యవసాయ పనుల్లో చేదోడుగా నిలిచే కాడెద్దులకు కృతజ్ఞతగా జరుపుకునే ఈ పండుగతో, పల్లెలన్నీ పండగ శోభను సంతరించుకున్నాయి. పండుగను పురస్కరించుకుని రైతులు తమ కాడెద్దుల కొమ్ములకు రంగులు అద్ది, మెడలో గజ్జెలు, కొత్త ముక్కుతాళ్లు, వీపుపై రంగురంగుల బట్టలు వేసి . విశేషంగా నందుల మెడలో రంగురంగుల పూల మాలలను వేసి, కుంకుమ తిలకాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఇలా ముస్తాబు చేసిన కాడెద్దులను రైతులు మంగళవాయిద్యాల నడుమ మండలంలోని పోచమ్మ గుడి వెంకటేశ్వర్ల, శివలయా, ఆలయాల వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించి,



ఎద్దులకు ధూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాతలు ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకున్నారు. నేటి ఆధునిక యుగంలో యాంత్రీకరణ పెరిగినప్పటికీ, తమకు జీవనాధారమైన పశువులను దైవంగా భావించి పూజించే సంస్కృతిని కాపాడుకోవడం ఎంతో సంతోషంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## కలెక్టరేట్‌లో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి

**నిర్మల్ టౌన్ , సెప్టెంబర్ 10,(జనంసాక్షి)** జిల్లా కేంద్రంలోనీ కలెక్టరేట్లోలో సమావేశ మందిరంలో గురువారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.ముందుగా అదనపు కలెక్టర్, అధికారులతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఐలమ్మ పోరాటాలను గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ పాత్రను వివరించారు. నాటి కాలంలోనే దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి తెలంగాణ పోరాటాల చరిత్రలో ఒక గొప్ప అధ్యాయాన్ని లిఖించిందని తెలిపారు. వెట్టి చాకిరి నిర్మూలనకు పాటుపడిన గొప్ప మహిళ అని వివరించారు.



చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితో మనమంతా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చాకలి ఐలమ్మ లాంటి వీర వనితల చరిత్రను నేటి తరం ప్రజలు తెలుసుకోవాలన్నారు.ఈ వర్ధంతి కార్యక్రమంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ శంకర్, సిపిఓ గంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు నియామక శిక్షణ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ





కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా (ప్రతినిధి, సెప్టెంబర్ 10(జనంసాక్షి ):జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆధ్వర్యంలో ఉచిత పోలీసు నియామక శిక్షణ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలనతో చదువుతూ శిక్షణలో పాల్గొనాలని సూచించారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు అందుబాటులో ఉన్న శిక్షణా వనరులను సద్వినియోగం చేసుకుని,లక్ష్య సాధన వరకు నిరంతరం కృషి చేయాలని అన్నారు. పోలీసు శాఖలో ఉద్యోగం ద్వారా ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం లభిస్తుందని,అభ్యర్థులు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక సామర్థ్యాన్ని కూడా పెంపొందించుకోవాలని సూచించారు. శిక్షణలో అధికారులు,సిబ్బంది అందించే సూచనలు, సలహాలను పాటించి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డి.ఎస్.పి అశోక్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్,పోలీస్ సిబ్బంది,శిక్షణ పొందుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

## పల్లెల్లో పోలాల పండుగ సందడి



కౌటాల సెప్టెంబర్ 10 జనం సాక్షి పోలాల పండుగ తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ తదితర ప్రాంతాలలో రైతులు ప్రకృతికి, మూగజీవాలకు కృతజ్ఞతగా జరుపుకునే అత్యంత ప్రాచీనమైన సంప్రదాయ పండుగ. గురువారం కౌటాల మండల కేంద్రంలోని అన్ని గ్రామాల్లో పోలాల పండుగ జరుపుకున్నారు. రైతులు ఉదయాన్నే ఎద్దులను శుభ్రంగా కడిగి, వివిధ రకాల రంగులతో అలంకరణ చేసి, మెడలో గంటలు, జూలాలు వేసి ఎంతో భక్తి శ్రద్ధలతో కొత్త బట్టలు ధరించి గ్రామ దేవత పోచమ్మ గుడి వద్దకు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా బయలుదేరుతారు. ఊరేగింపులో నృత్యాలు, పల్లె పాటలు పాడుతూ ఎంతో ఆనందోత్సవాలతో వెళ్లి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం ఇంటికి చేరుకున్నాక ఎద్దులకు పూజలు చేసి పాటలు పాడుకొని హారతి ఇస్తారు.

## తాండూర్ గ్రంథాలయంలో
### జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆకస్మిక తనిఖీ



తాండూర్, సెప్టెంబర్ 10(జనం సాక్షి) మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అర్జున్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయ నిర్వహణ తీరును, పాఠకుల హాజరు రికార్డులను నిశితంగా పరిశీలించారు. అనంతరం పుస్తకాల జారీ (ఇష్యూ), తిరిగి స్వీకరణ (రిటర్న్)కు సంబంధించిన వివరాలను మరియు కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి అర్జున్ మాట్లాడుతూ... గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు, నిరుద్యోగ యువతీ యువకులకు అవసరమైన అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలను, నవలలను మరియు దినపత్రికలను నిరంతరం అందుబాటులో ఉంచాలని సూచించారు. గ్రంథాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, పాఠకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఇన్చార్జి లైబ్రేరియన్ రామారావు, స్వీపర్ స్వామిలను ఆదేశించారు.

## పుష్కరాల పనులు గడువులోగా పూర్తి చేయాలి
### శాఖల సమన్వయంతో నాణ్యతగా ఏర్పాట్లు: కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో ,సెప్టెంబరు 10 (జనంసాక్షి): గోదావరి పుష్కరాల పనులను అన్ని శాఖల సమన్వయంతో చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం బాసర ఈవో కార్యాలయంలో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి పుష్కరాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, మరుగుదొడ్లు, ఆర్టీసీ బస్సుల ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల రద్దీ నియంత్రణ, సంఖ్య లెక్కింపు కోసం ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. చేపట్టే పనులను ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించి నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో నిఘా ఉంచుతామన్నారు. తగినంత పోలీసు సిబ్బందిని కేటాయిస్తామని చెప్పారు. సమావేశంలో వివిధ శాఖల ఈఈలు, ఆలయ ఈవో అంజనాదేవి, తహసీల్దార్ పవన్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కన్నెపల్లిలో మెడికల్ క్యాంపు




కౌటాల సెప్టెంబర్ 10 జనం సాక్షి విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై పలు సూచనలు అందించారు. మండలంలోని కన్నెపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎంపీ యూపిఎస్ పాఠశాలలో బుధవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. వసుంధర హాస్పిటల్, కౌటాల వారి సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బ్లడ్ గ్రూప్ టెస్టింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది విద్యార్థుల బ్లడ్ గ్రూప్‌లను పరీక్షించి, ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు అందించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మోర్లె పార్వతి సహకరించి, వసుంధర హాస్పిటల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. విద్యార్థులకు ఉపయోగకరంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువ నాయకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు




కుంటాల,సెప్టెంబర్ 10(జనం సాక్షి): మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశత్వానికి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చేసిన వీరోచిత పోరాటాన్ని, ఆమె అందించిన స్ఫూర్తిని ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజబాపు కొనియాడారు. ఐలమ్మ పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుంటాల గ్రామానికి చెందిన రజక సంఘం నాయకులు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రీ-సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి
### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



తాండూర్, సెప్టెంబర్ 10(జనం సాక్షి) రీ -సర్వే ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని తాండూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రీ-సర్వే ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రీ-సర్వేకు సంబంధించిన కో-రిలేషన్ రిజిస్టర్ నిర్వహణ, వివరాల నమోదు తదితర అంశాలను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. మండలంలోని రాంపూర్ గ్రామానికి సంబంధించి రికార్డుల హక్కుల నవీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఆర్.ఓ.ఆర్. లో వివరాల నవీకరణ చేపట్టేటప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన ప్రామాణిక విధానాల ప్రకారం అన్ని చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. రీ-సర్వే ప్రక్రియలో భాగంగా భూ రికార్డుల పరిశీలన, పాత రికార్డులతో నూతన రికార్డుల అనుసంధానం, కో-రిలేషన్ రిజిస్టర్ నిర్వహణ తదితర అంశాలలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



నిర్మల్ టౌన్ ,సెప్టెంబరు 10: (జనంసాక్షి) మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పెండింగ్ వేతనాలు, బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ డీఈవో కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. బిల్లులు ఆన్‌లైన్‌లో రిజెక్ట్ అవుతున్నాయని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కార్మికుల వేతనాన్ని నెలకు రూ.10 వేలకు పెంచాలని, మెస్ చార్జీలు, కోడిగుడ్ల బిల్లులను పెంచాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలోని అల్పాహార బిల్లులు చెల్లించాలని, రాగిజావకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె. రాధా, లక్ష్మి, సునీత, బాను పాల్గొన్నారు.

## మట్టి గణపతులను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం
### జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు




నిర్మల్ బ్యూరో సెప్టెంబర్10,(జనంసాక్షి ) మట్టి గణపతులు పూజించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అన్నారు.కలెక్టరేట్‌లో గురువారం అధికారులకు, సిబ్బందికి అదనపు కలెక్టర్ ఉచిత మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో మంచి మార్పు మన నుంచే ప్రారంభం కావాలని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, కృత్రిమ రంగుల వల్ల పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుందని, ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన విగ్రహాలనే పూజించాలని అన్నారు. పండుగలన్నీ సాంప్రదాయ పద్ధతుల్లో పర్యావరణ హితంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలకు ఆన్‌లైన్ అనుమతి తప్పనిసరి

### నెన్నెల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి



**నెన్నెల, సెప్టెంబర్ 10, (జనంసాక్షి)** రాబోయే వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించే వారు పోలీసుశాఖ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని నెన్నెల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి సూచించారు. విగ్రహాల ప్రతిష్ఠ, మండపాల ఏర్పాటుకు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తును పరిశీలించిన అనంతరం పోలీసుశాఖ జారీ చేసే అధికారిక అనుమతి పత్రం పొందిన తర్వాతే మండపాలు, మైక్ సెట్లు, ఇతర ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా విగ్రహాలను ప్రతిష్ఠించరాదని స్పష్టం చేశారు. ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షిత వాతావరణంలో జరిగేలా మండల ప్రజలు పోలీసుశాఖకు సహకరించాలని కోరారు.

## వినాయక చవితి సమన్వయ కమిటీ సమావేశం

### ముందస్తు అనుమతితోనే వినాయక మండపాలు వేయాలి



**సిర్పూర్ టి, సెప్టెంబర్10(జనంసాక్షి):** రానున్న వినాయక చవితి ఉత్సవాలను, పురస్కరించుకుని మండల కేంద్రంలో అధికార యంత్రాంగం, పోలీసు శాఖ ఆధ్వర్యంలో, సమన్వయ శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్, కౌటాల సీఐ సంతోష్ కుమార్, తాహసిల్దార్ రహీముద్దీన్, ఎస్సై సాగర్, పాల్గొని ఉత్సవ నిర్వాహకులకు పలు కీలక సూచనలు చేశారు. వినాయక మండపాల ఏర్పాటుకు, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, శాఖల ముందస్తు అనుమతులు తప్పనిసరి. వినాయక మండపాల లో డీజేలకు అనుమతి లేదు. మైక్ సెట్లకు పరిమిత శబ్ద నియంత్రణ పాటించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని. అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రి వేళల్లో నిర్వాహకులు తప్పనిసరిగా మండపాల దగ్గర ఉండాలని వీలైతే ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా అధికారులు నిర్దేశించిన మార్గాల్లోనే, సమయపాలన పాటిస్తూ నిమజ్జన ఊరేగింపులు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల అధికారులు, పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా పొలాల అమావాస్య పండుగ



**సారంగాపూర్,సెప్టెంబర్10(జనం సాక్షి)** సారంగాపూర్ మండలంలోని అన్ని గ్రామాలు తండాలు, గూడాల్లో గురువారం పొలాల అమావాస్య, బసవన్నల పండుగను రైతులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ ఎడ్లను శుభ్రంగా కడిగి, కొమ్ములకు రంగులు వేసి, మెడలో గజ్జలు, జూలాలు, కొత్త గొంగళ్లతో అందంగా అలంకరించారు. అనంతరం బసవన్నలను హనుమంతుని ఆలయాల వద్దకు తీసుకెళ్లి హరహర మహాదేవ అంటూ నినదిస్తూ ఆలయం చుట్టూ తిప్పారు. నైవేద్యాలు సమర్పించి హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పశువులను రైతు పూజించే గొప్ప ఎడ్ల పండుగ



**నెరడిగొండ సెప్టెంబర్10 (జనంసాక్షి):** పొలాల అమావాస్య వేడుకలు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గురువారం రోజున ఘనంగాఅలంకరించిన ఎద్దులతో హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలుమండలంలోని ఆయా గ్రామా పెద్దల ఆధ్వర్యంలో పొలాల అమావాస్య పండుగను రైతులు,గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.పశువులను రైతులు పూజించే గొప్ప పొలాల పండుగ సందర్భంగా రైతులు తమ ఎద్దులను వివిధ రకాల అలంకరణ వస్తువులతో అందంగా ముస్తాబు చేశారు. అనంతరం అలంకరించిన బసవన్నలను గ్రామాల్లో ఊరేగిస్తూ హనుమాన్ ఆలయాల వద్దకు తీసుకెళ్లారు.సంప్రదాయాలను పాటిస్తూ హనుమాన్ ఆలయంలో ఎద్దులకు ప్రత్యేక పూజలు నిర్వహించి,మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని,పశుసంపద ఆరోగ్యంగా ఉండాలని రైతులు భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

## సమికృత పాఠశాలను మండలం కేంద్రంలోనే ఏర్పారు చెయ్యాలి



**పెంచికల్ పేట్ సెప్టెంబర్ 10,(జనంసాక్షి )** పెంచికల్‌పేట్ మండల కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం సమీకృత గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. ఈ పాఠశాల నిర్మాణానికి సుమారు రూ.200 కోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం వెచ్చిస్తోంది. పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో మంజూరైన ఈ సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి అవసరమైన భూమిని పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 61లో ఉన్నటువంటి ప్రభుత్వ భూమినీ కేటాయించాలని . అక్కడ ఉన్న ప్రభుత్వ భూమిలో నుంచి 25 ఎకరాల భూమిని తక్షణమే పెంచికలపేట మండలంలో తో పాటు చుట్టు పక్కల మండలాల లోని గ్రామాల నిరుపేద విద్యార్థులందరికీ, మధ్యతరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. సమీకృత గురుకుల పాఠశాల సాధన జీూజ కన్వీనర్ ఎలగందుల తిరుపతి తెలిగె.రమేష్ పుల్గం దమాజీ ఆల్ తెలంగాణ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ సుంపుటం సాయికిరణ్ నిర్వాహిస్తున్నా ఇట్టి దీక్షకు నాలుగో రోజు తేదీ 10-09-2026 సమీకృత గురుకుల పాఠశాల సాధన దీక్షకు మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సముద్రాల. రాజన్న అద్వర్యం లో కాంగ్రెస్ పార్టీ పుర్తి మద్దతు తెలిపారు. నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పాంధిర్ల. నాగులు అద్వర్యం లో నాయి బ్రాహ్మణ సంఘం పుర్తి మద్దతు తెలిపి వీ=ూ గరికి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచులు చప్పిడే.రవీందర్, షేక్ ఉస్మాన్, నాయకులు, ఎల్కారి లచన్న కాగజ్‌నగర్ మండల బీజేపీ అధ్యక్షులూ పుల్లా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం

- రాజీయే రాజమార్గం మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి
- జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10(జనంసాక్షి ):** జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ఈ నెల 12వ తేదీ శనివారం నిర్వహించనున్న నేపథ్యంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ కోరారు. రాజీ పడదగిన వివిధ రకాల కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఒక వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు,ఆస్తి విభజన వివాదాలు, కుటుంబ, వైవాహిక జీవితానికి సంబంధించిన సమస్యలు,బ్యాంకు రికవరీ కేసులు,విద్యుత్ చౌర్యం కేసులు,చెక్ బౌన్స్ కేసులు తదితర అంశాల్లో ఇరువర్గాలు పరస్పర రాజీ ద్వారా తమ వివాదాలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. చిన్న చిన్న వివాదాలను పెద్ద కక్షలుగా మార్చుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం,ధనం వృథా చేసుకోవద్దని సూచించారు. “రాజీయే రాజమార్గం”అనే భావనతో న్యాయశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందాలని కోరారు. జిల్లాలోని పోలీసు అధికారులు,కోర్టు విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి,సంబంధిత ఇరువర్గాల వారితో కౌన్సిలింగ్ నిర్వహించి అవగాహన కల్పిస్తారని తెలిపారు.తమ కేసుల్లో రాజీ ద్వారా పరిష్కారం కోరుకునే వారు సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్నేహపూర్వక వాతావరణంలో వివాదాలను ముగించుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు



**ఏటూరు నాగారం సెప్టెంబర్ 10( జనం సాక్షి).** వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి కార్యక్రమాన్ని ఏటూరునాగారం మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రజక సంఘం అధ్యక్షులు పర్వతాల ఎల్లయ్య మొదటగా చిట్యాల చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వీరనారి చాకలి ఐలమ్మ త్యాగాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి గ్రామంలో రజకుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఐక్యంగా ముందుకు సాగుతూ రజకుల హక్కుల సాధన దిశగా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని కోరారు.హక్కుల సాధన కోసం చైతన్యంతో ముందుకు సాగాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కుదురుపాక రాజేష్, పర్వతాల కుమారస్వామి, పర్వతాల నర్సయ్య,చింతలపల్లి సుమన్,పర్వతాల రమేష్, రమేష్ (పెద్దోడు ),కుమ్మరికుంట్ల సతీష్,కుదురుపాక గిరిబాబు, పర్వతాల రత్తమ్మ,వార్డు మెంబర్లు అంగాల వీరన్న, గంప సాయి కిరణ్, పెద్దబోయిన బాలకృష్ణ,బట్టు గోపి,కూనూరు సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



**మంగపేట, సెప్టెంబర్10 (జనంసాక్షి)** ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అఖిల నేతృత్వంలో మండల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. అఖిల మాట్లాడుతూ.. మానసిక ఒత్తిడి, మానసిక ఆందోళన తదితర మానసిక సమస్యలతో బాధపడుతున్న యువత పెద్దలలో ఆత్మహత్య ఆలోచనలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. సమస్యలను తోటి వారితో పంచుకోవాలని సూచించారు. మానసిక సమస్యలతో సతమతమవుతున్న వారికి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ‘టెలి-మానస్’ నంబర్ 14416 ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శారద దేవి, సూపర్‌వైజర్లు ముత్తమ్మ, పద్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ పనులను పరిశీలించిన ఎస్ఈ సంపత్ రెడ్డి



**దేవరుప్పుల, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** జనగామ ఎస్ఈ సంపత్‌రెడ్డి మండలంలో సింగరాజు పల సెక్షన్‌లో విద్యుత్ పనులను ఆకస్మికంగా పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ షెడ్, ఏఈ కార్యాలయం, సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసి, విఫలమైన డీటీఆర్‌లను త్వరితగతిన మరమ్మతు చేసి, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. చిన్మడూరులో జరుగుతున్న మూడో వైర్ పనులను పరిశీలించి ఈ నెల 20లోపు అన్ని గ్రామాల్లో పనులు పూర్తి చేయాలని సూచించారు. రాంబోజిగూడెం సమీపంలోని 220 కేవీ సబ్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలించి పనులు త్వరగా ప్రారంభించాలని ట్రాన్స్‌కో అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఏడీఈ అనిల్, ఏఈ నర్సింహులు, ఎస్ఎల్ఐ లక్ష్మయ్య, ఎల్ఐ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

**నల్లబెల్లి, సెప్టెంబరు 10(జనంసాక్షి):** మండలంలోని నందిగామ గ్రామంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని నల్లబెల్లి పోలీసులు గురువారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.4,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయిప్రసన్న కుమార్ తెలిపారు.

## ఎస్ఐకి ఆటో యూనియన్ సన్మానం



**కెరమెరి, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** కెరమెరి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గా బాధ్యతలు స్వీకరించిన కె.రాజును గురువారం నాడు ఆటో యూనియన్ ప్రెసిడెంట్ జావిద్ ఖాన్, యూనియన్ సభ్యులు సోమన్న, శంకర్, అమూల్, రవి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

# రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు నిలిపివేయాలి

అప్పగింత వంటి ప్రతి దశలో మిల్లర్లకు ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా తనిఖీలు, కేసులు, ఒత్తిళ్లతో ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని మిల్లర్లపై అనవసరమైన చర్యలను నిలిపివేయాలని కోరారు. రైస్ మిల్లర్ల సమస్యలపై ప్రభుత్వం వెంటనే అసోసియేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. మిల్లర్లకు అనుకూలమైన విధానాలు అమలు చేయడంతో పాటు, నాణ్యత లేని ధాన్యం విషయంలో తగిన పరిష్కారం చూపాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు రాష్ట్ర అసోసియేషన్ నిర్ణయం మేరకు బంద్ కొనసాగిస్తామని వెంకట్రావు స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో గోపి,రవీందర్,బోజరెడ్డి. శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీని ప్రాణంగా భావించిన వ్యక్తి వెంకటరెడ్డి

**బయ్యారం సెప్టెం బర్ 10 ( జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీని ప్రాణంగా భావించిన వ్యక్తి రేలా వెంకటరెడ్డి అని సొసైటీ చైర్మన్ బండారి మల్లయ్య, సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ అన్నారు. గురువారం అకస్మాత్తుగా మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త వెంకట్ రెడ్డి మృతదేహం ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మృతదేహం పై పార్టీ పతాకమును కప్పి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీని అభిమానంగా భావించే వెంకటరెడ్డి మృతి బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు రేలా ఆగి రెడ్డి, కంబాల ముసలయ్య, నాయకులు తగిర సత్తిరెడ్డి, ములుకూరి వీరారెడ్డి, నాయిని శ్రీనివాస్ రెడ్డి, ఏనుగుల రంజిత్, సుద్ధపల్లి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రాచపల్లిలో వైద్య శిబిరం



**నూగూర్ వెంకటాపురం సెప్టెంబర్ 10(జనం సాక్షి) :** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రం లోని రాచపల్లి గ్రామంలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.గ్రామం లో క్షయ వ్యాధి గ్రస్తులను గుర్తించి తేమడ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణి చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి చుట్టు ప్రక్కల ఆవరణలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని అన్నారు. కాచి చల్లార్చిన నీళ్లు త్రాగాలని తెలిపారు. గ్రామస్తులకు రక్త పోటు, థైరాయిడ్, లాంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్స్, ప్రజలు పాల్గొన్నారు.

# గణనాథుడి మండప నిర్వహకులు పోలీసు శాఖ అనుమతి తీసుకోవాలి



**హనుమకొండ ప్రతినిధి / దామెర సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** దామెర మండలంలోని వివిధ గ్రామాల్లో గణేష్ మండపాలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులకు దామెర ఎస్ఐ . వీరభద్రరావు పలు సూచనలు చేశారు.గణేష్ మండపాల ఏర్పాటుకు ముందుగా పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని, మండపాల వద్ద విద్యుత్ వైర్లు, లైటింగ్ ఏర్పాటు విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.విగ్రహ నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలను పాటించాలని, డీజేలు మరియు లౌడ్‌స్పీకర్ల వినియోగంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధల తో నిర్వహించేందుకు మండప నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని దామెర ఎస్ఐ వీరభద్రరావు కోరారు.

## ది విశాల సహకార సంఘం అధ్యక్షులుగా ఇంద్రసేనా రెడ్డి



ఎల్కతుర్తి (జనంసాక్షి) : మండల కేంద్రంలో నూతన చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన నామినేట్ పదవులకు కొలువు దీరిన సొసైటీ బ్యాంక్ చైర్మెన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన ఇంద్ర సేనారెడ్డి ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాకు ఈ అవకాశం ఇచ్చిన మంత్రి పొన్న ప్రభాకర్ గౌడ్ డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలి పి రాబోయే రోజుల్లో నూతన డైరెక్టర్ల ఆధ్వర్యములో ది విశాలసహకార సంఘన్నీ మరింత అభివృధి దశలో తీసుకువెళ్తానని అదేవిధంగా నియోజకవర్గ ఎమ్మెల్య్ మంత్రి వర్యులు శ్రీ పొన్న శీ ప్రభాకర్ ఆదేశాల మేరకు ధి విశాల సహకార సభ్యుల సహకారంతో సూపర్ మార్కెట్ పెట్రోల్ బ్యాంకు తో పాటు మరిన్ని అభివృధి దశలో తీసుకువెళ్లి సంఘంలో సభ్యుల సంఖ్యాను కూడా పెంచి రైతులకు అనగా సభ్యులకు దీర్ఘ కాల రుణాలు స్వల్ప కాల రుణాలు ఇచ్చి సంఘాన్ని మరింత అభివృద్ధిలోకి తీసుక వెళ్తానని అన్నారు..అలాగే బ్యాంక్ డైరెక్టర్ లుగా దామెర గ్రామానికి చల్ల ధనలక్ష్మి మద్ది రాములు కేషా పూర్ ఇనుగాల సుధాకర్ ,మోడెమ్ రాజయ్య తిమ్మాపూర్ , వీరమల్ల ముకుందా రెడ్డి, ఎల్క్ తుర్తి,శనిగరపు. స్వరూప, పెంచికల్ పెట్ ఏడేళ్ల అశోక్ రెడ్డి వల్భాపూర్ తంగ్గల్లపల్లి కొమురయ్య, వీరనారాయణ పూర్ పుల్లూరి నర్సింగ రావు , తిరుపతి బక్కయ్య. చిర, రాజయ్య లను డైరెక్టర్లుగా బాధ్యతలను చేపట్టారు.

**వివాదంలో సొసైటీ**

గత కొంతకాలంగా ది విశాల సహకార బ్యాంక్ దోపిడికి గురైన విషయం తెలిసింది ఈ విషయంపై గత పాలకులు, శ్రీపతి రవీందర్ గౌడ్ కార్యవర్గ సభ్యులు ఆధ్వర్యంలో జరిగిన విషయాన్ని వెలికి తీసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోర్టులో ఆధ్వర్యంలో విచారించగా దాదాపుగా మూడు కోట్ల 50 లక్షల రూపాయలను తేడా చూపించినట్లు ప్రతి రైతు సమావేశంలో తెలిపినప్పటికీ సెటిల్మెంట్ చేసి కొంత ఆదాయాన్ని సంఘానికి అప్పచెప్పినట్టు రైతుల ద్వారా డైరెక్టర్ ద్వారా తెలిసింది ఆది నుండి నేటి వరకు వివాదాస్పదంగా ఉన్న సొసైటీ బ్యాంకు ను. నూతన బాధ్యతలు చేపట్టిన చైర్మన్ మరియు బ్యాంక్ డైరెక్టర్లు లాభాల బాటలో నడిపించి దీర్ఘకాలిక రుణాలు స్వల్పకాలిక రుణాలు ఇచ్చి సభ్యులకు ఆదాయం. వనరులను పెంచి అభివృద్ధి దశలో తీసుకువెళ్లాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అదేవిధంగా సొసైటీ బ్యాంకులో ఆదాయం ఉన్నప్పటికీ వాడుకునే పరిస్థితులు లేక దోపిడీ గురికాక కాకుండా చూసే బాధ్యత డైరెక్టర్ల బ్యాంక్ చైర్మన్ లపై ఉంటుందని చైర్మెన్ . సి ఓ నిర్లక్ష్య వైఖరి చేయడం వల్ల కొన్ని తప్పిదాలు ఉండే ప్రమాదం ఉంటుందని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

## మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తా



**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** అందరిసహకారంతో స్టేషన్ ఘన్పూర్ మున్సి పాలిటీ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తారని మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమా ర్ అన్నారు. పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏఈలు, కాంట్రాక్టర్లు, అధికా రులతో మున్సిపాలిటీ అభివృద్ధి పనులపై చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి కొర కు మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు, తదితర అభివృద్ధి పనులపై నివేదిక తయా రు చేయడం జరిగిందని అన్నారు, కౌన్సిలర్ల, కో ఆప్షన్ సభ్యుల, అధికారుల, ప్రజ, సహకా రంతో అభివృద్ధి పనులు చేసి మున్సిపాలిటీ ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నేతలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డిని దేవరుప్పుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దావేరా అనిల్ కుమార్, మండల నాయకుడు మొటికె చంద్రశేఖర్ హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో గ్రామాల సమస్యల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## మండల ప్రత్యేక సమావేశం నేడు

**గోవిందరావుపేట, సెప్టెంబర్10 (జనం సాక్షి ):** శు క్రవారం ఉదయం 10.30 గంటలకు మండల కేంద్రంలోనిరైతు వేదికలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వరుణ్ కుమార్ తెలిపారు. మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన సర్పంచులు, మండల స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, పెండింగ్ సమస్యలు, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు సమావేశానికి తప్పనిసరిగా హాజరై తమ పరిధిలోని సమస్యలు, అభివృద్ధి పనుల వివరాలను సమావేశం దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో వరుణ్ కుమార్ సూచించారు.